KSR02B132
C

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఆగస్టు 07, 2016

E ENTERED

ప్రపంచానికి

అణు ప్రమాదం



జూహి చావ్లా, షారుక్ ఖాన్

రణబీర్ కపూర్, అయాన్

దోస్తానా

నిజమైన స్నేహం జీవితానికి భరోసానిస్తుంది. జీవన గమనంలో ఎంతో మంది పరిచయమైనా నిస్వార్థంగా మనని వెన్ను తట్టి నడిపించే మిత్రులు మాత్రం కొందరే ఉంటారు. కెరీర్ పరంగా వచ్చే విజయాలు అపజయాల్ని లెక్కచేయ కుండా ముందడుగేస్తున్న నేటి తారలే ఈ వారం ఫ్రెండ్షిప్‌డే స్పెషల్ సెలబ్రిటీస్. షారుక్, జూహీల తొలి సినిమా 'డూప్లికేట్'. తర్వాత ఎన్నో సినిమాల్లో కలిసి నటించిన ఈ పాపులర్ స్టార్లిద్దరూ నిజజీవితంలో మంచి మిత్రులు కూడా. హృతిక్, ఫర్హాన్ అక్తర్‌లు చిన్ననాటి మిత్రులైనా ఇద్దరూ కలిసి నటించిన 'జిందగీ నా మిలేగీ దుబారా' వీళ్ల స్నేహబంధాన్ని మరింత బల పరి చింది. కరణ్ జోహార్ దర్శకత్వంలో వచ్చిన ఎన్నో చిత్రాల్లో మిత్రులైన షారుక్, కాజోల్ జోడీ ఉంటుంది. 'వేకప్ సిద్', 'ఏ జవానీ హై దివానీ' సినిమాల్లో రణబీర్ కపూర్‌తో కలిసి నటించిన అయాన్ ముఖర్జీ బెస్ట్ ఫ్రెండ్. సంజయ్ లీలా బన్సాలీ దర్శకత్వంలో ఐష్ కొన్ని సినిమాలే చేసినా ఇద్దరూ మంచి మిత్రులు. కరీనా కపూర్‌తో కలిసి ఆడియో ఫంక్షన్లు, పార్టీలకి హాజరౌతున్న అమృతా రావ్ కరీనా బెస్ట్‌బడీస్ లిస్ట్‌లో చేరిపోయింది. జీవితంలో ఒడిదొడుకుల్ని ఎదుర్కొనే ధైర్యాన్ని అందిం చుకున్న సల్మాన్, సంజదత్‌ల స్నేహ బంధం కూడా దృఢమైనదే.

కరణ్ జోహార్, కాజోల్



హృతిక్, ఫర్హాన్



సంజయ్‌లీలా బన్సాలీ, ఐశ్వర్య

కరీనా కపూర్, అమృతా రావ్

KSR 02 B1 32
కథా నిలయం
శ్రీకాకుళం

స్ఫూర్తి



తండ్రి పుట్టిన రోజు వేడుకని పిల్లల మధ్య నిర్వహించాలని ఆదిత్య అనాథ శరణాలయానికి వెళ్లాడు. అక్కడ బిన్నీ అనే ఓ పసి గుడ్డు ప్రత్యేకంగా కనిపించాడు. ఆరా తీస్తే బిన్నీ అక్కడకి వచ్చే నాటికే గుండెకు రంధ్రం, కంటిచూపు సమస్యతోపాటు డౌన్స్ సిండ్రోమ్ ఉందనే విషయాలు తెలిసాయి. ఆ పసివాడి సమస్యల్ని కని కదిలి పోయాడు ఆదిత్య. వెంటనే బిన్నీని దత్తత తీసుకుని పెంచుకోవాలనుకున్నాడు. కానీ తన వయసు సరిపోదని ఇండోర్ జ్యోతి నివాస్ శరణాలయం వివరించింది. బిన్నీని కను రెప్పలా చూసుకోవాలనే ఆరాటం ఆయన్ను చట్టాల మార్పుకు పోరాటం చేయించింది. కన్నబిడ్డను దక్కించుకున్నంత ఉద్వేగానికి లోనయ్యాడు ఈ 'కని' పెంచిన తండ్రి.

'కని' పెంచిన తండ్రి

పూణెలోని ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగి 27 ఏళ్ల ఆదిత్య. జీవితంలో స్థిరపడ్డాక వివాహానంతరం అనాథ పిల్లల్ని దత్తత తీసుకోవాలని ఆయనకు ఉండేది. అందుకే తన తండ్రి పుట్టిన రోజు సెప్టెంబర్ 13న అనాథ శరణాలయాల్లో జరుపుకునేవాడు. అలానే ఇండోర్‌లోని జ్యోతి నివాస్ అనాథ శరణాలయానికి పిల్లలకి కానుకలందించేందుకు వెళ్లి బిన్నీని చూశాడు. భోపాల్‌లోని ఒక సంపన్న కుటుంబంలో బిన్నీ 2014 మార్చి 16న జన్మించాడు. ఆరోగ్య సమస్యలతో పుట్టిన బిన్నీ ఆ కుటుంబంలో మూడో సంతానం కావడంతో తల్లిదండ్రులు కొన్ని రోజులకే ఆ పసికందుని అనాథ శరణాలయానికి అప్పగించారు. అప్పటికి తన పెళ్లి కాకపోవడంతోపాటు భారత్‌లో చిన్నారుల దత్తతకు వయోపరిమితి 30 సంవత్సరాలు కావడంతో బిన్నీని ఆదిత్య దత్తత తీసుకోవడం కుదరలేదు. మూడేళ్ల తర్వాత దత్తత తీసుకోవాలని, అప్పటి వరకు బిన్నీ వైద్య ఖర్చుల్ని భరించాలనుకున్నాడు. పుణె నుంచి ఇండోర్‌కి వెళ్లిన ప్రతిసారీ బిన్నీని చూసి రావడంతో పాటు తన ఆరోగ్యంపై ఆరా తీసేవాడు. మూడు నెలల్లోనే బిన్నీకి ఎంతో దగ్గరయ్యాడు.

ఉలికిపాటు..

2014లో బిన్నీ ఇండోర్ నుండి భోపాల్‌లోని మరో స్వచ్ఛంద సంస్థకి తరలించడం ఆదిత్యని కలవరపరిచింది. నెలలో రెండు రోజులు బిన్నీ కోసం పుణే, ఇండోర్, భోపాల్‌ల మధ్య ప్రయాసతో కూడిన ప్రయాణాన్ని కొనసాగించేవాడు. 2015 మార్చి 28న బిన్నీని కలిసేందుకు వెళ్లిన ఆదిత్యని భోపాల్ శరణాలయం సిబ్బంది అనుమతించలేదు. కొందరు విదేశీయులు బిన్నీని దత్తత తీసుకోడానికి ముందుకు రావడంతో బిన్నీని ఢిల్లీకి తరలించామని నిర్వాహకులు చెప్పడంతో ఉలిక్కిపడ్డాడు ఆదిత్య. వారితో వాదిస్తే ఆ చిన్నారి గురించి ప్రశ్నించేందుకు చట్టపరమైన అధికారాలేవీ ఆదిత్యకి లేవంటూ నిర్వాహకులు చిరాకుపడ్డారు. అక్కడితో వదిలేయకుండా కోల్‌కతాలోని మిషనరీ హెడ్ ఆఫీస్‌లో బిన్నీ గురించి వాకబు చేస్తే ఆ పేరుతో ఢిల్లీకి ఎవరినీ తరలించలేదన్న సమాధానం ఆదిత్యని మరింత కలవరపరిచింది. తల్లిదండ్రుల నుంచి బిన్నీని తీసుకోవడంతోపాటు అతన్ని విదేశాలలో నివసించేవారికి దత్తత ఇచ్చేందుకు ఎలాంటి చట్టపరమైన అనుమతులూ లేవని తెలియడంతో ఆదిత్యకు కొంత మనసు తేలికపడింది.

సీఎం నుంచి పీఎం వరకు

బిన్నీని తనతో తీసుకెళ్లాలనుకున్నా చట్టపరమైన నిబంధనలు అడ్డుపడుతుండటంతో తన సమస్యని పరిష్కరించాలని కోరుతూ మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి ఎన్నో సార్లు లేఖ రాసినా ఎలాంటి జవాబు లభించలేదు. కిరణ్ బేడి, మనేకా గాంధీ, అన్నాహజారే లాంటి ఎంతో మంది ప్రముఖులతో పాటు ప్రధాన మంత్రికి 500 పైగా ఈ-మెయిల్స్, వందకిపైగా ఉత్తరాలు పంపాడు. ఒక రోజు కేంద్ర మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి మనేకా గాంధీని కలిసే అవకాశం లభించింది. తన సమస్యని వివరించాక ఆమె ముందుగా సిఎఆర్ఎ(సెంట్రల్ అడాప్షన్ రెస్యూ అథారిటీ)కి ఆదిత్య విషయాన్ని పరిష్కరించాలంటూ సిఫార్సు చేసింది. సిఎఆర్ఎ బిన్నీ గురించి భోపాల్‌లోని శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆరా తీయడంతో భోపాల్ శరణాలయం రికార్డుల్లో బిన్నీ పేరు లేకపోవడంతో పాటు బిన్నీ లాంటి మరో నలభై మంది చిన్నారులని సంస్థ చట్ట వ్యతిరేకంగా విదేశాలకు పంపేందుకు ఢిల్లీకి తరలించిందన్న నిజాలు బైటపడ్డాయి. స్థానిక మీడియా, సిఎఆర్ఎ సాయంతో బిన్నీతో పాటు మిగిలిన చిన్నారులందరినీ భోపాల్‌కి వెనక్కుతేగలిగాడు ఆదిత్య. ఆదిత్యకి కొంత ఉపశమనం లభించినా బిన్నీని స్వీకరించడానికి వయస్సు పరంగా అర్హత లేకపోవడం పెద్ద సమస్యగా మారిందతనికి. పార్లమెంట్‌లో దత్తతకు కొత్త స్వీకరణ మార్గదర్శకాలపై చర్చ జరుగుతుందని తెలుసుకున్న ఆదిత్య ఆ బిల్లుని ఆమోదించాలని కోరుతూ తన సమస్యని రాసి ఒక లేఖను లోక్‌సభ స్పీకర్‌కు పంపాడు. 2015 మే 9న పిఎపి (ప్రాస్పెక్టివ్ ఎడాప్టివ్ పేరెంట్) వయోపరిమితిని 25 సంవత్సరాలకి కుదిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆగస్టు 1న బిల్లు కార్యరూపం దాల్చడంతో స్థానిక కలెక్టర్, సాయంతో 2016 జనవరి 1న బిన్నీని దత్తత తీసుకుని అవ్నీష్ అని పేరు పెట్టాడు. కుటుంబ సభ్యులు మొదట తిరస్కరించినా బిన్నీపై ఆదిత్యకున్న ప్రేమని అర్థం చేసుకున్నారు. జులై 16న ఇండోర్ అమ్మాయి అర్పితని వివాహమాడిన ఆదిత్య బిన్నీకి అమ్మ లోటు తీర్చాడు. పెళ్లికి అనాథ పిల్లల్నే అతిథులుగా పిలిచాడు. పదివేల మంది అనాథ పిల్లలకు విందు అందించాడు. 1000 అనాథ జంతువుల ఆకలి బాధను తీర్చాడు. పెళ్లికి వచ్చే పెద్దల నుంచి పుస్తకాలు, మందులను కానుకలుగా కోరి వాటిని శరణాలయాలకు, అనాథలకు అందించాడు. వందలాది చెట్లను నాటించాడు.

ఇండెక్స్

స్టార్..................3
అనంతపురం జర్నీ

వివరం...............4
చదువుల వీధి..పుస్తకాల నిధి..

కార్టూన్ పంచ్......... 5

వింత లోకం...........10
నవ్వించే ఉల్లి

కొత్త పుస్తకాలు........11
అసహనంపై అవగాహన

కవిత్వమ్...............14
నీవే

ప్రపంచానికి అణు ప్రమాదం

అట్టమీది కథ...6

సందర్భం - 12
స్నేహమంటే ఇదేరా

ప్రత్యేకం....................15
ఇలాంటి యువకులే కావాలి

కథ 16
వడగాలి

తెలుసా....................19
లెఫ్ట్ హ్యాండర్స్ డే

రుచి.....................21
కార్న్ క్రాకర్స్

బాల నేస్తాలు.............23
11 ఏళ్ళ ఇంజినీర్

పద వికాసం.....
....24

సమాజానికి కనువిప్పు 'కబేళా'

సమాజంలో వృద్ధుల సమస్యలను 'కబేళా' కథ ద్వారా మాదా అంజనేయులుగారు చక్కగా తెలియజేశారు. కొడుకులైనా, తమ్ముళ్లైనా తల్లిదండ్రుల ఆదాయం మీద మక్కువ ఉన్నందు వల్లనే వృద్ధాప్యంలో తల్లిదండ్రులని పనికిరాని వస్తువులుగా భావించి మునుపటిలా విలువ ఇవ్వరు. మాతృ మూర్తికి ప్రాణం పోయింది. అయినా కథలో చేతికి బంగారు గాజులున్నాయని కథకుడు కథకి మలుపు ఇవ్వడం బాగుంది.

-ఇలిపిల్ల సూర్యనారాయణ, భీమవరం

కలంతో చెట్టు

వ్యర్థ పదార్థాలతో కలం తయారు చేసిన లక్ష్మీ మీనన్ ప్రయోగం చాలా బాగుంది. ఈ ప్రయోగం ఆమె ద్వారా మరో నలుగురికి ఉపాధి కల్పిస్తుంది. మెదడుకు పదును పెడితే కొత్త ప్రయోగాలతో ఏదయినా చేయవచ్చు అని నిరూపించిన లక్ష్మీ మీనన్‌కు ధన్య వాదాలు.

- అనంతం రాజారావు, తాళ్లపూడి

పెళ్లికీ ఓ లెక్కుంది

నేడు వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పెళ్లిళ్లతో పాటు చిన్నవయసులో పెళ్లిళ్లద్వారా కలిగే సమస్యల్ని తెలిపిన అట్టమీది కథ ఆకట్టుకుంది. కరువు కాలంలో ఉలవపాడులో గంజి కేంద్రాన్ని నడిపిన డొక్కా సీతమ్మగారి కథనం కళ్లు చెమర్చింది. హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అక్రమంగా ఏటా లక్షల కోట్ల రూపాయల వ్యాపారం జరగడం బాధాకరం. ఒంటరిగా 37 దేశాలు, ఒకే బంగారం, షార్ట్ కట్, కార్టూన్ పంచ్, జోక్స్ బాగున్నాయి. వారసత్వ నటులకు కాస్త బ్రేక్ పడడంతో కొత్త నటుల సక్సెస్ పెరగడం, కథానాయికలకు మంచి రోల్స్ రావడం మంచి పరిణామం.

- ఆషాజ్యోతి, ఒంగోలు

బేకింగ్ అకాడెమీ

బేకింగ్ సైన్స్, పేస్ట్రీ ఆర్ట్స్‌ని చదివి 24 ఏళ్లకే వినేష్ జానీ బేకింగ్ అకాడెమీని పెట్టడం అభినందనీయం. నేటి సమాజంలో పెళ్లిళ్ల పోకడని సమగ్రంగా వివరించిన పెళ్లికీ ఓ లెక్కుంది ఆకట్టుకుంది. ద్రాక్ష మణి, రాజకుమారుడి విందు, హృదయాన్ని ఫాలో అవుతూ, గోదారి తీరంలో సీతమ్మ చెట్టు, కబేళా కథ, కార్టూన్ పంచ్, ప్రతి వస్తువునీ వృథాగా పడేయకుండా వాటికి కొత్త రూపాన్ని ఇవ్వొచ్చని నిరూపించిన కలంతో చెట్టు ఆకట్టుకుంది.

- దీపిక, విజయవాడ

దేశాధినేతల షార్ట్‌కట్ స్టైల్

బ్రిటన్ ప్రధాని థెరెసా మే, మేరీ రాబిన్‌సన్ లాంటి ఎంతో మంది దేశాధినేతల పవర్‌కు షార్ట్‌కట్ స్టైల్ కలిసొచ్చింది. రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాల్లో డొక్కా సీతమ్మకు బంగారు నంది రావడం ఆనందాన్ని కలిగించింది. కరువు ప్రాంతాల్లో గంజి కేంద్రాలని నడిపి ఎంతో మంది ఆకలితీర్చినా సన్మానాలు. సత్కారాలకి దూరంగా జీవించిన ఆమె నేటి తరానికి ఆదర్శనీయం.

- కల్పన, ఒంగోలు

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

అనంతపురం జర్నీ

స్టార్

'అనంతపురం' చిత్రం ఎంత మంది చూసుంటారో తెలీదు కానీ, అందులోని 'కొంటె చూపుతో..' అనే గీతానికి చాలామంది అభిమానులైపోయారు. తమిళంలో 'సుబ్రమణ్యపురం'గా సంచలనం సృష్టించిందీ 1980 కాలపు కథా చిత్రం. అప్పటి వస్త్రధారణలో జులపాల జుట్టుతో, ఒత్తైన గెడ్డంతో, హీరోయిన్ వెంట పళ్లికిలించుకుంటూ... తల ఊపుతూ పిచ్చోడిలా తిరిగే పాత్రను చేశాడు జై. మొన్నామధ్య జర్నీ చిత్రంలో అమాయకుడిగా చేసిందీ జైనే. ఇలా విలక్షణమైన పాత్రలతో హీరోగా జర్నీ చేస్తున్న జై సంగీత దర్శకుడు కావాలని కలలు కన్నాడు. ప్రయత్నాలూ చేశాడు. కానీ అనుకోకుండా హీరో అయ్యాడు.

తమిళ సంగీత దర్శకులు దేవా, శుభేష్ మురళీల మేనల్లుడు జై.

- జై కూడా ముందు కీబోర్డు ప్లేయర్‌గా చేశాడు. కీబోర్డు ప్లే చేయడంలో ట్రినిటీ కాలేజీలో విద్యను కూడా అభ్యసించాడు. ఏడేళ్ల పాటు తర్ఫీదు పొందాడు.
- యువన్ శంకర్ రాజాకు జై వీరాభిమాని. కంపోజర్‌గా ఏదొక రోజు అందరూ ఆశ్చర్యపోయేలా సంగీతాన్నివ్వాలని మనసులో ఎప్పుడూ అనుకుంటూ ఉండేవాడట.
- జై తన పదహారేళ్ల ప్రాయంలోనే వెండితెరపై మెరిశాడు. తన కజిన్ శ్రీకాంత్ దేవా చెప్పడంతో 2002లో ఎ.వెంకటేష్ దర్శకత్వంలో వచ్చిన 'భగవతి' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. అందులో హీరో విజయ్‌కు తమ్ముడుగా చేశాడు. తర్వాత తెలుగులో '6టీన్స్' సినిమాను తమిళంలో రీమేక్ చేస్తే అందులో హీరోగా చేశాడు. తర్వాత రెండు మూడు చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా అవకాశాలు వచ్చాయి.
- తర్వాత కెరీర్‌లో స్లో అయ్యాడు. ఇక హీరోగా అవకాశాలు రాక సంగీతంపై దృష్టి సారించాడు.
- ఈ తరుణంలో హీరో శింబు తనకు నటనలో కొన్ని మెళకువలు చెప్పారని, హీరోగా ఎదగడానికి ఏం చేస్తే బాగుంటుందో అవగాహన కల్పించారని జై ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు.



- 2007లో 'చెన్నై 600028' చిత్రానికి ఆడిషన్స్ జరుగుతున్నప్పుడు జై స్నేహితుడు సింగర్ యుగంధ్రన్ రికమండ్ చేశాడు. జై మంచి నటుడని ఓ సారి అవకాశం ఇవ్వాలని డైరెక్టర్ వెంకట్ ప్రభును ఒప్పించాడు. క్రికెట్ నేపథ్యంలో సాగిన ఈ సినిమాలో జైదే లీడ్ రోల్. ఈ చిత్రం విజయం సాధించింది. తక్కువ బడ్జెట్‌తో తీసినా మంచి కలెక్షన్లు తెచ్చిపెట్టింది.
- మొదట్లో జైని హీరోగా తీసుకోవడానికి నిరాకరించిన వెంకట్ ప్రభు 'చెన్నై 600028' హిట్టవడంతో ఈయనతోనే సినిమాలు తీస్తానని ప్రకటించాడు.
- మధురైలో 1980లో ప్రేమికులపై జరిగిన ఓ హింసాత్మక ఘటనను 2008లో 'సుబ్రమణ్యపురం'గా తీశారు. శశికుమార్ దర్శకుడు. మరో దర్శకుడు అమీర్ ఈ చిత్రానికి నిర్మాత. జైని అడిగితే కథేంటో వినకుండానే చేస్తానని అంగీకరించాడు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డుల మోత మోగించింది. జై నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. ఈయనను ఓ పెద్ద స్టార్‌ను చేసిందీ చిత్రం.
- ఈ సినిమా విడుదలైన తర్వాత తమిళ చిత్ర సీమ నుంచి మొదటసారిగా ఈయనకు హీరో అజిత్ నుంచి ఫోన్ వచ్చింది. అద్భుతంగా నటించావని ప్రశంసించారు. ఈయన కెరీర్‌కు అజిత్ కూడా బాగా సహాయం చేశారు.
- 2009లో మూడు సినిమాలు చేశాడు. అందులో 'వామనన్' చిత్రం విజయం సాధించింది. ఈ సినిమాతో కమర్షియల్ హీరోగా గుర్తింపు లభించింది. ఆ సమయంలో చిత్ర నిర్మాతలపై కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు కూడా చేశాడు.
- అప్పట్లో ఈ గొడవతో వెంకట్ ప్రభు దర్శకత్వంలో 'గోవా' చిత్రం షూటింగ్ నిలిచిపోయింది. చిత్ర నిర్మాత రజనీకాంత్ కూతురు సౌందర్య కలుగజేసుకుని సమస్యను సద్దుమనిగేలా చేశారు. 'గోవా' చిత్రం పర్వాలేదనిపించింది.
- 'అవాల్ పియర్ తమిజరసి'(తమిళంలో ఈమె పేరు అరసి)లో యువకుడుగా, వృద్ధుడుగా రెండు పాత్రల్లో చేశాడు. ఈ పాత్రలకు విమర్శకుల నుంచి ప్రశంసలు లభించినా సినిమా మాత్రం నిరాశ పరిచింది.
- వైఫల్యాల వల్ల నిరాశతో ఉన్న జైకి మురుగదాస్ మళ్లీ లైఫ్ ఇచ్చాడు. ఆయన నిర్మాణంలో ఎం.శరవణన్ దర్శకత్వంలో వచ్చిన 'జర్నీ' (ఇంగేయుమ్ ఇప్పొతుమ్) చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. అమాయకుడి పాత్రలో జై ప్రేక్షకులను మెప్పించాడు. శర్వానంద్, జై, అంజలి, అనన్య ఇందులో ముఖ్య పాత్రలు పోషించారు.
- 2013లో ఆర్యతో కలసి సహాయ నటుడిగా 'రాజా రాణి' చేసి అప్పుడు సూపర్ అనిపించుకున్నాడు. చిత్రం కూడా బ్లాక్‌బస్టర్ అయింది. ఈ సినిమాలో ఆర్య పాత్ర కంటే ఈయన పాత్రకే ఎక్కువ మంది కనెక్ట్ అవుతారు. ఈ సినిమా తర్వాత చేసిన 'నవీన సరస్వతి సబతమ్' మాత్రం అనుకున్న ఫలితాలు రాలేదు.
- గత ఏడాదంతా కొన్ని చిత్రాల్లో అతిథి పాత్రల్లో చేశాడు. ఇప్పుడు ఐదు చిత్రాల్లో చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. 'చెన్నై 600028' సీక్వెల్ కూడా చేస్తున్నాడు.

- కొప్పుసెట్టి దేవరాజు



కాలం దొంతరల్ని పేజీల్లో సర్దుకున్న పాత పుస్తకాలకు షోకేస్ కోల్‌కతాలోని కాలేజీ స్ట్రీట్. తాత, ముత్తాతల నాటి పుస్తకం కావాలన్నా... అంతకు ముందరి తరాల సాహిత్యాన్ని నింపుకున్న కాగితపు రెపరెపల్ని ముట్టుకోవాలన్నా ఈ వీధిన వెదికితే సరి. రాజుల కాలం నాటి అచ్చేసిన పుస్తకాలూ అక్కడక్కడా కనిపిస్తూ ఓ పుస్తక మ్యూజియంలో తిరగాడినట్టుంటుంది. ప్రపంచంలోని అతి పొడవైన సెకండ్ హ్యాండ్ పుస్తకాల అమ్మకపు వీధిగా దీన్ని గుర్తించారు. అందులో ఓ నడక తీస్తే...

చదువుల వీధి.. పుస్తకాల నిధి..

సాహిత్యం, కళల ప్రయోగ కేంద్రంగా పిలవబడే ఇండియన్ కాఫీ హౌజ్ అడ్డా, విద్యా సంస్థలు, ప్రచురణ కేంద్రాలు... ముఖ్యంగా చిన్నా, పెద్దా పుస్తక అమ్మకం దుకాణాలు కాలేజీ స్ట్రీట్‌కు పేరొచ్చేలా చేశాయి. 'బోయ్ పరా' (పుస్తకాల కాలనీ)గా బెంగాలీలు పిలుచుకునే ఈ వీధి విజ్ఞానం అద్దుకుని కనిపిస్తుంది. తెలుగు, తమిళం, మళయాళం, కన్నడలాంటి భారతీయ భాషలే కాక ఫ్రెంచ్, జర్మన్, లాటిన్ లాంటి విదేశీ భాషలతో కూడిన పుస్తకాలు ఒకేచోట దొరికితే పుస్తక ప్రియుల ఆనందానికి హద్దులుండవు. కోల్‌కతా మహా నగరంలో ఉండే ఈ కాలేజీ స్ట్రీట్‌లో ఇప్పటి పుస్తకాలే కాదు నూట యాభై సంవత్సరాల క్రితం అచ్చేసిన పుస్తకాలూ దొరుకుతాయి. ఈ వీధిని బోబజార్ అనే పేరుతోనూ పిలుస్తారు. ఈ స్ట్రీట్ బోబజార్ మొదలుకొని మహాత్మాగాంధీ రోడ్డు వరకు 1.5 కిలో మీటర్ల పొడవున ఉంటుంది. ఇక్కడ కొత్త పుస్తకాలు, పాత పుస్తకాలనూ విక్రయిస్తుంటారు. అంతేగాక బేరసారాలూ ఉంటాయి. కొనుగోలుపై 50 శాతం, ఆపైగా డిస్కౌంట్‌నూ పొందవచ్చు. ఎక్కడా దొరకని అరుదైన పుస్తకాలను ఇక్కడ పొందవచ్చు. పుస్తకాల పట్ల ఆపేక్ష ఉన్నవారికి ఈ ప్రాంతం అమూల్యంగా అనిపిస్తుంది.

రెండొందల ఏళ్లు..

ఇక్కడి పుస్తక దుకాణాలను 18వ శతాబ్దం నుంచే కొంత మంది పుస్తక ప్రియులు ప్రారంభించారు. అప్పటి నుండి వారి వారసులు ఈ దుకాణాలను నడుపుతున్నారు. ఈ దుకాణాలలో భాష, సాహిత్యం, కవిత్వం, కళ, విప్లవాలు, ఆయుర్వేదం, హోమియోపతి, సంగీతం, కథలు, నవలలు ఇలా ఒకటేమిటి అన్ని రకాల పుస్తకాలు దొరుకుతాయి. ఇక్కడ కేజీ స్థాయి నుంచి వైద్య విద్య వరకూ అధునాతన పుస్తకాలు లభ్యమవుతాయి. ఈ వీధిలో నేషనల్ బుక్ స్టోర్స్, శ్రీ అరవిందో పత్ మందిర్, దాస్ గుప్తా అండ్ కో, చక్రవర్తి అండ్ చటర్జీ, బానీ లైబ్రరీ లాంటి ప్రఖ్యాత పాత పుస్తకాల దుకాణాలూ ఉన్నాయి. ప్రఖ్యాత రచయితల తొలి రచనలు, దశాబ్దాల క్రితం ముద్రించిన కరపత్రాలు సైతం ఇక్కడ దొరుకుతాయి. నెదర్లాండ్స్, దక్షిణాసియా దేశాలలో సంస్కృతంలో రాసిన ఆయుర్వేద పుస్తకాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. విదేశీయులు ఎక్కువగా భారతదేశ రాజ కుటుంబాలు, జమీందార్ల గురించి రాసిన పుస్తకాలను కొనుగోలు చేస్తుంటారు. ఏదైనా పుస్తకం కోసం ఈ వీధిలోకి వచ్చిన పాఠకుడు నిరాశతో వెనుదిరిగే అవకాశముండదు. ఎందుకంటే పుస్తకం ప్రతి లేకున్నా ఇంటర్‌నెట్‌లో ఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందో చెప్పేవాళ్లు చాలామందే కనిపిస్తారు. కాలేజీ స్ట్రీట్ 2007లో 'టైమ్ మ్యాగజైన్' సర్వేలో 'బెస్ట్ ఆఫ్ ఆసియా' జాబితాలో చోటు దక్కించుకుంది.

చదువుల లోకం

కాలేజీ వీధికి ఇరువైపులా చుట్టూ అంతా చదువే కనిపిస్తుంది. సుప్రసిద్ధ కళాశాలలు, ప్రతిష్టాత్మక విద్యాలయాలున్నాయి. కోల్‌కతా విశ్వవిద్యాలయంతోపాటు ప్రెసిడెన్సీ కాలేజ్, సంస్కృత కాలేజ్, స్కాటిష్ చర్చి కాలేజ్, బెతూన్ కాలేజ్, కోల్‌కతా మెడికల్ కాలేజ్, సాంఘీక సంక్షేమం, బిజినెస్ మేనేజ్‌మెంట్, విద్యాసాగర్ కళాశాల, హిందూ స్కూల్, స్కాటిష్ చర్చి స్కూల్, బెతూన్ స్కూల్, హోలీ చైల్డ్ స్కూల్ వంటి ఎన్నో విద్యాసంస్థలకు ఆలవాలమీ ప్రాంతం. ఎవరైనా ఇక్కడికి రాగానే ఒక కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుభూతిని పొందుతారు. చదువుల లోకంలో విహరిస్తున్న భావన కలుగుతుంది.

ఓ కప్పు కాఫీ..

ఇక్కడి కాఫీ హౌజ్‌ను ఎందుకు కళల ప్రయోగశాలగా పిలుస్తారో తెలుసా! వీలైతే నాలుగు మాటలు.. కుదిరితే కప్పు కాఫీ అని ఇక్కడ అనలేరు. కుదిరితే ఓ గొప్ప చర్చ... వీలైతే మరో కప్పు కాఫీ.. అనేలా మేథోమథనం సాగిపోతుంటుంది. బెంగాలీ భద్రలోకులకు ఇది అడ్డా. మేధావి, విజ్ఞాని అనే మాటలకు వీళ్లు బానిసలు. చదువుసంధ్యలున్నోడే పరిపూర్ణమైన మనిషని పిలిచే బెంగాలీ బాబుల విజ్ఞాన దాహాన్ని కాలేజీ వీధి తీరిస్తే.. వారి కళా సృష్టికి బ్లూ ప్రింట్ కూర్చడానికి కాఫీ హౌజ్ అడ్డా అవుతుంది. ఇది ఎంతో మంది కవులు, కళాకారులు, ప్రపంచ సాహితీవేత్తలకు సమావేశ స్థలంగా, చర్చా వేదికగా మారింది. సత్యజిత్‌రే, అమర్త్యసేన్, మృణాల్‌సేన్, అపర్ణసేన్ లాంటి ఎందరో మేధావులు ఈ కాఫీ హౌజ్‌కు వస్తుండేవారు. కాఫీతోపాటు కళనో, శాస్త్రాన్నో పంచుకునేవారు.. ఎంగిలిపడేవారు. సగటు మనిషి అక్కడికెళ్ళినప్పుడు ఆ రుచి తగులుతుంది. అక్కడి కుర్చీల్ని తడమగానే ఎందరో కళాకారులు, మేధావుల తలపులు మనసుకు తగులుతాయి. ఓ పుస్తకం కొనమని అక్కడి జ్ఞాపకాలు తరుముతాయి.

- కుమారి.ఎన్

కార్టూన్ పంచ్



నవ్వుల్ - పువ్వుల్

వేడి వేడి కాఫీ

ఓ పెద్ద కంపెనీలో కొత్తగా ఉద్యోగంలో చేరాడో వ్యక్తి. కాఫీ తెప్పించుకునేందుకు కెఫెటేరియాకనుకుని ఓ ఎక్స్‌టెన్షన్‌కు ఫోన్ చేశాడు.

అటు నుంచి.. 'హలో..!' అని వినిపించగానే.. 'త్వరగా కాఫీ పంపించవోయ్..! వేడి తగ్గితే బాగోదు' అంటూ కాస్త బిల్డప్ ఇచ్చాడు.

(అవతలి వ్యక్తి ఆగ్రహంగా) "ఒరేయ్ ఫూల్! ఎవరికి చేశావో తెలుసా?"

"ఎవరికీ కెఫెటేరియాకేగా"

"కాదు.. మీ కంపెనీ ఎండీకి చేశావ్"

"అవునా! ఎండీ గారు.. మీకు నేనెవరో తెలుసా?"

"నువ్వు చెప్పందే ఎలా తెలుస్తుంది?"

హమ్మయ్య బతికిపోయాననుకుని ఫోన్ పెట్టేశాడా ఉద్యోగి.

పుస్తకం ప్రాబ్లమ్స్

టీచర్: బంటి నీ లెక్కల పుస్తకమేది?

బంటి: లేదు, ఆత్మహత్య చేసుకుంది.

టీచర్: ఎందుకు?

బంటి: దాని నిండా ప్రాబ్లమ్స్ ఉన్నాయ్.

మెప్పుకోలు

20 సంవత్సరాలుగా భార్యని మెచ్చుకోని చలపాయ్ ఒక సాధువు సలహా మీద... చివరకు మెచ్చుకోవాలని డిసైడ్ అయ్యాడు.

భార్యభర్తలు రాత్రి భోజనం చేయడం మొదలెట్టారు. కూరలో ఉప్పు చాలా ఎక్కువ ఉంది. అయినా మెచ్చుకున్నాడు.

అంతే చేతిలో ఉన్న గరిటుచ్చుకుని చలపాయ్ నెత్తి మీద ఒక్కటిచ్చుకుంది భార్య కాంతం.

ఎందుకు కొట్టిందా అని చలపాయ్ ఆలోచిస్తుండగా... ఆమె బాధతో గొంతు పెగిల్చింది. 'నేనెంత రుచిగా చేసినా ఏదో వంక పెడతావ్. అదే పక్కింటి పంకజం వండిన కూరలో ఉప్పెకువైనా దాన్ని పొగుడుతావా?' అనే సరికి చలపాయ్ మైండ్ బ్లాంక్ అయ్యింది.

అణుబాంబు దాడి హిరోషిమా నగరాన్ని తుడిచి పెట్టేసింది.. ఇది మానవులకు సామూహిక ఆత్మహత్యగా పరిణమిస్తుంది. నిరాయుధులైన సామాన్య ప్రజలను యుద్ధంలో బలిపశువులను చేసి, యుద్ధం ఎక్కడో సరిహద్దుల్లో రెండు దేశాల సైన్యాల మధ్య కాకుండా జనహననంగా మార్చిన దుశ్చర్య అది. ఈ అణు యుగం ఆరంభమై నేటికి ఏడు దశాబ్దాలు దాటింది. అణ్వస్త్రాల యుద్ధ పాటవాన్ని తమ సైన్యాలకు అందజేసే ప్రయత్నంలో అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు ఈ 70 ఏళ్ళలో బాంబు తయారీ ముమ్మరం చేశాయి. న్యూక్లియర్ ఫైవ్‌గా ఈ ప్రమాదకర సాంకేతికతను కలిగి ఉండడం ఆధునిక ప్రపంచ దేశాలలో పెద్ద హోదాగా ఒక వాతావరణాన్ని సృష్టించాయి. అన్ని వనరుల్లానే అణుశక్తి ఉత్పత్తి, ఆయుధ తయారీలో వినియోగం అనేది ఒక లాభసాటి వ్యాపారంగా చూస్తున్నారు తప్పితే దాని దుష్ప్రభావాల్ని లెక్కచేయడం లేదు. అమెరికా, రష్యాల దగ్గర మొత్తం ఇవాళ ప్రపంచ దేశాల వద్ద గల అణ్వాయుధాలలో 97 శాతం ఉన్నాయి. వీటి శక్తితో ప్రపంచాన్ని ఒకసారి బూడిదచేసి తిరిగి ఆ బూడిదనీ మరికొన్ని వందల సార్లు బూడిదగా మార్చొచ్చు. ఈ రెండు దేశాలు తమ తమ పౌర సమాజాలను కూడా అణుధార్మికతకు ఈ 70 ఏళ్ళుగా ఎంతో కొంత బలి ఇస్తూనే ఉన్నాయి. ఇప్పటి పరిస్థితుల్లో అణ్వాయుధాలతో యుద్ధాలు జరిగితే ఎవరూ గెలిచే అవకాశం లేదు. అందువల్ల పరస్పర విధ్వంసక పరిస్థితిగా అభివర్ణించారు. ప్రపంచంలోని అణు ప్రమాదాన్ని దాని తీవ్రతను అంచనా వేసే 'బులెటిన్ ఆఫ్ ద అటామిక్

ఎవరి దగ్గరెన్ని...

2014 నాటి ప్రపంచ అణ్వాయుధ ముఖ చిత్రం ఇలా ఉంది

అమెరికా	- 4,760
రష్యా	- 4,300
బ్రిటన్	- 225
ఫ్రాన్స్	- 300
చైనా	- 250
ఇజ్రాయిల్	- 80
ఇండియా	- 110
పాకిస్తాన్	- 120

ఉత్తర కొరియా - 10 కన్నా తక్కువగా.

మొత్తం ప్రపంచంలో 9,920 అణుబాంబులు ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి.

ప్రపంచానికి అణు ప్రమాదం

హిరోషిమా, నాగసాకి, చెర్నోబిల్, ఫుకుషిమా ఇవి కేవలం నగరాల పేర్లు కాదు.. శాస్త్ర విజ్ఞానం పేరిట మూడు అడుగులు వేసిన మృత్యు విలయానికి చిరునామాలు. యుద్ధంలోనూ, శాంతిలోను అణుశక్తి మానవాళికి మహా ప్రమాద హేతువని నిరూపించిన విపత్కర ఫలితాలు. 1945 ఆగస్టు 6న అన్ని యుద్ధ సూత్రాలకు విరుద్ధంగా అమెరికా.. సాధారణ ప్రజలు, యుద్ధంలో లేనివారు జీవించే నగరంపైన పెద్ద యెత్తున జన నష్టం, సామూహిక వినాశనం జరుగుతుందని తెలిసే అణుబాంబు ప్రయోగం అనే యుద్ధ నేరానికి పాల్పడింది. ప్రపంచ అణు యుగంలోకి అడుగుపెట్టింది. అడుగు పెట్టగానే రెండు లక్షల మంది ప్రజలు బూడిదైపోయారు. అణు విద్యుత్ ప్లాంట్ల ప్రమాదాలతోను జన నష్టం, పర్యావరణ నష్టం తక్కువేమీ కాదు.

- రామ తీర్థ

9849200385

సైంటిస్ట్స్'కు చెందిన 2016 లెక్కల ప్రకారం ఇప్పుడు మహా విలయపు అర్ధరాత్రి అవడానికి మన భూమి కేవలం మూడే మూడు నిమిషాల దూరంలో ఉన్నామని తాజా అంచనాలు తెలిపాయి. ఇది 2012లో 5 నిమిషాల దూరంలో ఉండగా, ఈ నాలుగేళ్ళలో ఇంకో 2 నిమిషాలు దాటి ప్రమాదంలో పీకల దాకా కూరుకుపోయి ఉన్నామని తెలుపుతోంది. ప్రపంచం సర్వవినాశన కారకాల సంఖ్య పెచ్చు మీరిందని, ఈ ముప్పు నివారణ చర్యలు సత్వరమే తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రమాద సంభవ కారకాలు ఏ మాత్రం తగ్గు ముఖం పట్టలేదు.. సరికదా గడియారం ముందుకు నడుస్తోంది. వివేక వంతులైన నాయకులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

1980లో అణ్వాయుధ సముపార్జన దేశాల మధ్య పోటీ పెరిగిన తీరు పౌరులను భయభ్రాంతులను చేస్తుంది. 1986 నాటికి అత్యధికంగా అమెరికా 21 వేల 317, రష్యా 40 వేల 159, బ్రిటన్ 350, ఫ్రాన్స్ 355, చైనా 224, ఇజ్రాయిల్ 44 అణ్వాయుధాలు కలిగి ఉన్నాయి. మరికొన్ని దేశాలు అణ్వాయుధ పాటవం సంతరించుకోకున్నా అణు పరీక్షలు జరిపాయి. గ్రీన్ పీస్ వంటి సంస్థలు పెద్ద ఎత్తున చైతన్యవంతం చేయడం ఆయా దేశాల ప్రజలలో కన్పించిన వ్యతిరేకత మొదలయినవి ఈ అణ్వాయుధాల కుప్ప తగ్గడానికి ముఖ్య కారణాలు.

సైన్స్ అండ్ సెక్యూరిటీస్ బోర్డ్', 'అటామిక్ సైంటిస్ట్' న్యూక్లియర్ నోట్ బుక్ వివరాల ప్రకారం ఈ 2016 నాటికి వీటి సంఖ్య దేశాల ఆయుధ నిల్వల్లో గణనీయంగా తగ్గినా ఈ అణుబాంబు పరిజ్ఞానాన్ని వనరులను తమ చేత చిక్కించుకోవాలని తీవ్రవాద సంస్థలు కూడా అహర్నిశలు కృషి చేస్తుండడం గడగడలాడిస్తోంది. అగ్రరాజ్యాలు తమ అణ్వాయుధ రాశిని పదివేల సంఖ్య నుంచి తగ్గించి కొన్ని వేలల్లోకి తెచ్చినా... ప్రమాద సంభవ అవకాశాలు ఎన్నో దేశాల నుంచి కన్పిస్తూ ఇవాళ మానవాళిని ఇంకా ముప్పులోనే ఉంచాయి. వినాశన గడియారం ముల్లు ఎక్కడ ఉండాలో నిర్ణయం తీసుకునేందుకు... ప్రపంచ దేశాల వద్ద ఉన్న అణ్వాయుధాలు, అణ్వాయుధ పదార్థ భద్రత, అణు పదార్థాల నిల్వ, వీటి సమర్థత, సక్రమ నిర్వహణ, దొంగతనంగా తరలిపోవడానికి గల అవకాశాలు ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటారు. కేవలం అణ్వాయుధ సన్నద్ధతల గురించి మాత్రమే కాక శాంతి కాలంలో అణు విద్యుత్ రియాక్టర్లను, వాటి పనితీరును, అందులో ఉన్న లోటు పాట్లను, భద్రత లోపాలను కూడా గుర్తించి అప్పుడు సామూహిక వినాశనానికి మనం ఎన్నినిమిషాల దూరంలో ఉన్నది అంచనా వేస్తుంది.

అణు రియాక్టర్ల చేటు

అణు రియాక్టర్లతో మరిన్ని సమస్యల్ని పెంచుకుంటోంది ప్రపంచం. ఈ ఏడు దశాబ్దాలలో పెద్ద ఎత్తున అణు విద్యుత్ రియాక్టర్లను నిర్మించారు. వాటి వల్ల కలిగే ప్రమాదాలను పక్కకు పెట్టి మరీ మరిన్ని దేశాల్లో ప్లాంట్‌లు స్థాపించుకుంటూ పోతున్నారు. నిర్వహణ, భద్రత విపత్తులు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని దూరదృష్టితో ఆలోచించడం లేదు. దీనికి ఉదాహరణలుగా అప్పట్లో త్రీమెన్ ఐలండ్, చెర్నోబిల్, ఈ మధ్య పుకుషిమా అణు రియాక్టర్ ప్రమాదాలు నిలిచిపోతాయి. మానవ తప్పిదాలతోపాటు ఊహించని సునామీలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తుల్లో అణు విద్యుత్ రియాక్టర్‌లు చేసే చేటు అంతా ఇంతా కాదని తెలిసొచ్చింది. అగ్రరాజ్యాలలోని అణు విద్యుత్ ప్లాంట్‌లనే సక్రమంగా నియంత్రించడం కష్టమవుతోంది. కొత్త దేశాలు ఈ సాంకేతికతను వంటబట్టించుకోగలవంటే ఆలోచించాల్సిందే.



అణు చోరీలు

అణు పదార్థాలు దొంగిలింపబడిన సంఘటనలు అమెరికాలో 27, ఫ్రాన్స్‌లో 2, అర్జెంటీనాలో 2, చిలీలో 2, మెక్సికోలో 2, ఇతర దేశాలలో 12 సంఘటనలు జరిగాయి. ఈ సంఘటనలన్నీ ప్లుటోనియం పదార్థాల పరిశుద్ధి తర్వాత జరిగిన దొంగతనాలు. పదార్థాల నష్టం అంటే లెక్క తెలీకుండా పోవడం వంటి సంఘటనలే ఇవి. ఆందోళనను పెంచుతున్నాయి. ప్రమాదకర సాంకేతికతలను విజ్ఞాన శాస్త్రపు ముందడుగుగా భావిస్తూ... ఎలా మానవాళి తన విపత్తును తానే కొని తెచ్చుకుంటున్నదో చెబుతున్నాయి అణ్వాయుధ దేశాల భద్రతా సమస్యలు.

యుద్ధ కాలపు అణు బాంబులా... శాంతి కాలపు అణు విద్యుత్ రియాక్టర్ కూడా అంతే ప్రమాదకారకం. దీర్ఘకాలపు అణుధార్మిక వ్యాప్తి వల్ల అణువ్యర్థాలను వదిలించుకునే నిర్వహణ విషయాల్లో లోపభూయిష్ట శాస్త్ర పద్ధతులనే ఉపయోగిస్తున్నారు. అందుకే అణుమహమ్మారి శాంతి కాలంలో రెండు విలయ తాండవాలు చేసింది. ఒకటి 1980ల నాటి చెర్నోబిల్, రెండోది అయిదేళ్ళు కిందటి పుకుషిమా. వీటి వల్ల పర్యావరణానికి తీరని నష్టం జరిగింది. వీటితో పాటు జరిగిన చిన్నాపెద్దా అణు దుర్ఘటనలు ఇంకొన్ని కూడా ఏడు దశాబ్దాల కాలంలో ఉన్నాయి. సాధారణంగా ఓ పరిశ్రమ ఏర్పాటు చేసేటప్పుడు భద్రత, సంభవించే విపత్తుల తీరు, ఏ రకంగా సత్వర స్పందనలతో విపత్తుల దుష్పరిణామాలను అరికట్టగలమనే విషయాలతోపాటు అలానే పరిశ్రమ ఉత్పత్తి ప్రక్రియలో వెలువడే పారిశ్రామిక వ్యర్థాలు తొలగింపు, అజమాయిషీ, రక్షణ, నిల్వలుగా ఉంచడమా, లేక వాటిని రీ సైకిల్ చేయడం వల్ల ఇంకేమయినా మానవాళికి ఉపయోగపడే ఉత్పత్తులను చేయగలుగుతామా వంటి విషయాల్ని క్షుణ్ణంగా ఆలోచించి కానీ పరిశ్రమలను ఏర్పాటు చేయరు. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే అణువిద్యుత్ రియాక్టర్ల ఏర్పాటు విషయంలో పారిశ్రామిక వ్యర్థాలయిన అణుధార్మిక పదార్థాల తొలగింపు ప్రక్రియ లేదు. వీటిని మూడు దళసరి పొరల మందం గల స్టీలు పెట్టెల్లో పెట్టి భూగర్భంలో దాచడం తప్ప. ఏ కాలంలో ఆ అణుధార్మిక ఇంధనం బయటపడుతుందో ఆ కాలపు ప్రజలకు ఆ మహమ్మారితో తంటాలు తప్పవు. అమెరికాలో 1954 ప్రాంతంలో జరిగిన త్రీమెన్ ఐలండ్ ఉదంతంతో విడుదలైన అణుధార్మికతకు ఇప్పటికి సరైన మూసివేత మార్గం లేదు. అలానే చెర్నోబిల్‌లో సైతం మూసేసిన రియాక్టర్లు ఇప్పటికీ అణుధార్మికతను వెదజల్లుతూనే ఉన్నాయి. అదే పరిస్థితి పుకుషిమాలోనూ ఉన్నది. చెర్నోబిల్ రియాక్టర్ పేలుడు బాధితుల పూర్తి వివరాలు ఇప్పటికీ తేలలేదు.

పుకుషిమా డేంజర్ బెల్

హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా అణు బాంబు దాడితో దెబ్బతిన్న జపాన్.. తమ శాంతి కాల అభివృద్ధి పేరిట అణు పదార్థ విజ్ఞానాన్ని అమెరికా సాయంతో వినియోగించుకునే దేశంగా మారడం పెద్ద వైపరీత్యం. అటు తుఫాను ఇటు సునామీ కలిసి విధ్వంసం చేయడంతో పుకుషిమా దాయిచీ అణు రియాక్టర్ సముదాయం దెబ్బతినిపోయింది. ఫలితంగా రియాక్టర్ల పేలుడు జరిగింది. ఈశాన్య

జపాన్‌లోని ఫుకుషిమా ప్రాంతం వ్యవసాయానికీ, పచ్చని ప్రకృతికి, అందమైన పర్వతాలకు పేరొందింది. ఇప్పుడీ అణు ధార్మికత బారినపడి విలవిల్లాడుతోంది. పారిశ్రామిక వ్యర్థాలకు సరైన తొలగింపు, నిర్మూలన పద్ధతులు లేనిది.. అసలు పరిశ్రమగా గుర్తింపు ఎలా పొందిందనేది పెద్ద ప్రశ్న. పోనీ విపత్తుల కాలంలో కచ్చితమైన మూసివేత సాధ్యమా అంటే అది అసలే సాధ్యం కాని పని.. అని ఇంతకు ముందు జరిగిన అన్ని పారిశ్రామిక అణు రియాక్టర్ పేలుళ్ళు ధృవపరుస్తున్నాయి. త్రీమైన్ ఐలండ్ కానీ చెర్నోబిల్ కానీ ఫుకుషిమా కానీ ఎక్కడా ఇన్నేళ్ళు గడుస్తున్నా ప్లాంట్‌లను డీ-కమిషనింగ్ చేయడం అనేది పూర్తి కాలేదు. వాటి నుంచి అణుధార్మికత విడుదలయి చుట్టు పక్కల జనావాసాలను, పాడి పంటలను, నదీ నదాలను, పర్యావరణాన్ని దెబ్బ తీస్తూనే ఉంది.

ఇదీ భారత్ అణు ముఖ-చిత్రం

ప్రస్తుతం భారత్‌లో 21 అణు రియాక్టర్లు పనిచేస్తున్నాయి. ఇవన్నీ ప్రభుత్వ నిర్వహణలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ అజమాయిషీలో పనిచేస్తున్నాయి. వీటిలో మొదటిదైన తారాపూర్ విద్యుత్ కేంద్రం 1969 అక్టోబర్‌లో ఏర్పాటైంది. రెండేళ్ల క్రితం తమిళనాడు కూడంకుళంలో అణు విద్యుత్ కేంద్రం ప్రారంభించారు. నలభై ఐదేళ్ల కాలంలో 21 ప్లాంట్లలో 51 యూనిట్లుగా మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలో వివిధ సామర్థ్యాలున్న ప్లాంటులున్నాయి. కూడంకుళం తప్ప మిగిలినవన్నీ 100 లేదా 220 మెగా వాట్ల సామర్థ్యం కలవి. 2006లోనే తారాపూర్‌లో 540 మెగా వాట్ల సామర్థ్యం గల పిహెచ్‌డబ్ల్యుఆర్ రియాక్టర్లను జోడించారు. వీటన్నింటి ద్వారా ఉత్పత్తయ్యేది 5480 మెగా వాట్ల లోపలే. అంటే మొత్తం విద్యుదుత్పత్తిలో అణు విద్యుత్ వాటా కేవలం మూడు శాతమే. 2010లో భారత ప్రభుత్వం 5780 మెగా వాట్ల జాతీయ అణు ఇంధన ఉత్పత్తి సామర్థ్యాల పెంపొందింపు ప్రణాళికను తయారు చేసింది. ఆ ప్రణాళిక ప్రకారం 2032 కల్లా 63 వేల మెగా వాట్ల సామర్థ్యం గల అణు విద్యుదుత్పాదన జరగాలన్నది లక్ష్యం. అందుకు అమెరికా, రష్యా, ఫ్రాన్స్, మంగోలియా, కెనడా, నమీబియా, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, ఇంగ్లండ్, కజకస్థాన్, దక్షిణ కొరియా, జపాన్‌లతో వివిధ రకాల ఒప్పందాలను చేసుకుంటూ వచ్చింది. అందుకే పాత రియాక్టర్ల స్థానే.. ఎక్కడ అణు విద్యుత్ ప్లాంట్ ప్రతిపాదన వచ్చినా ఆరు వేల మెగా వాట్ల పైగానే అనే పేరాశ ఉంది. అంటే 21 ప్లాంట్లు ఉత్పత్తి చేస్తున్న అణు విద్యుత్‌ను ఒక్క ప్లాంటే అందించాలని లక్ష్యాలు.

వ్యతిరేకిస్తున్నా...

భారీ ఖర్చుతో కూడిన, ప్రమాద నియంత్రణ స్థిరం కాని, వ్యర్థాల తొలగింపనేది భద్రంగా సాధ్యం కాని ఈ అణు విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటును ఎన్నో సమంజసమైన కారణాల వల్ల పౌర సమాజాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇవాళ్టికి ప్రపంచ ముఖచిత్రంలో 30 దేశాల్లో అణు విద్యుత్ ప్లాంట్‌లు పనిచేస్తున్నాయి. ఈ ప్లాంట్‌లలో మొత్తంగా 391 రియాక్టర్లు ఉన్నాయి. వీటిలో చాలా రియాక్టర్లు పనిచేసే కాలం ముప్పయ్యేళ్ళు అనుకుంటే ఆ కాలాన్ని దాటి పోయి, పొడిగించిన కాల వ్యవధిలో పనిచేస్తున్నాయి. వాటి భద్రతకు కావాల్సిన పద్ధతులను బలోపేతం చేయకుండానే ఈ రియాక్టర్ల ఆయుష్షు పెంచి ఆ మేరకు కొత్త ప్రమాదాలకు ప్రపంచ అణు పరిశ్రమ దారితీస్తున్నదని పరిశీలకుల అంచనా.

అవసరమా...

సాంకేతికతలో ఎంతో ముందున్న జపాన్ వద్దనే అణు రియాక్టర్ ప్రమాద ఫలితాలను అరికట్టే సాంకేతికత లేదని ఫుకిషిమా దుర్ఘటనకు అయిదేళ్ళు పూర్తయిన సందర్భంగా ఫుకుషిమా అధికారులు టోక్యో ఎలక్ట్రికల్ పవర్ కార్పొరేషన్ తరపున ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అణు విద్యుదుత్పాదన రంగంలో దశాబ్దాల అనుభవం గల దేశంలోనే విపత్తును ఎదుర్కోవడంలో ఇంతటి దయనీయ స్థితిలో సాంకేతిక ప్రమాణాలు ఉండగా మన భారతదేశపు అణు ప్రమాద నివారణ సన్నాహ సంసిద్ధత చాలా తక్కువని.. ఇంచుమించు లేదనే చెప్పాలి. ఇంధన అవసరాలకై జల విద్యుత్, ఇతర పునరుత్పాదక శక్తుల ద్వారా ఉత్పత్తిని పెంచాల్సిన ప్రభుత్వాలు ఈ విషయమై నిర్లక్ష్యం వహించి అణు విద్యుత్ కోసం అర్రులు చాచడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ ప్రమాదకర పరిశ్రమ తెచ్చి పెట్టే పలు అనర్థాలను ఎదుర్కోలేక జపాన్ వంటి సాంకేతిక అభివృద్ధి గల దేశాలే కళ్ళు తేల వేస్తుండగా మనం అటు మహారాష్ట్రలో గుజరాత్‌లో ఇటు ఆంధ్రప్రదేశ్‌లో ఏ రకమైన ఉన్నత సాంకేతిక పరిజ్ఞానం లేకుండా అణు విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం చాలా ఆందోళన కారకం. మన దేశంలో విద్యుత్ ఉత్పత్తిలో అణు విద్యుత్ ప్లాంట్ల వాటా కేవలం మూడు శాతమే.

కొవ్వాడలో అణు కొలిమి

కొవ్వాడపై దృష్టి పడింది. ఇక్కడ మొదట హిటాచీ కంపెనీ రియాక్టర్లు వస్తాయన్నప్పుడు ప్రతిపాదించిన సామర్థ్యం 9900 మెగావాట్లు. ఇంత పెద్ద అణు విద్యుత్ ప్లాంట్ ప్రపంచంలోనే ఎక్కడా లేదు. ఏ భద్రతా వ్యవస్థలు, ముందు జాగ్రత్తలు, స్థానిక ప్రజలకు విషయ వివరణ లేకుండా పాలక వర్గాలు ఇంత పెద్ద అటామిక్ పవర్ ప్లాంట్‌ను కొవ్వాడలో ఏర్పాటు చేయ సంకల్పించడం అత్యంత ప్రమాదకరం. ఇలాంటి ప్రతిపాదనలతోనే 6600 మెగావాట్ల సామర్థ్యమున్న అణు విద్యుత్ ప్లాంట్లను తమ ప్రాంతంలో ఏర్పాటు చేస్తామంటే మహారాష్ట్రలోని జతియాపూర్, గుజరాత్‌లోని మితీవర్దీ ప్రజలు తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. శ్రీకాకుళం జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంతం కొవ్వాడలో కూడా ఆందోళన ఉధృతమవుతోంది.

కొవ్వాడ ప్రాంతంలో పెద్ద కొవ్వాడ, చిన కొవ్వాడ, టెక్కలి, రామచంద్రపురం, కోటపాలెంలో మూడు వేల కుటుంబాలను ప్రభావితం చేస్తున్న ప్రస్తుత భూసేకరణ, రెండు వేల ఎకరాలకై సంసిద్ధంగా ఉంచింది ప్రభుత్వం. ఎంత తొందరలో ఉన్నదంటే.. ఇక్కడి భూముల రిజిస్ట్రేషన్ నిలిపేసింది. కుటుంబ అవసరాలైన ఆరోగ్యం, పెళ్లిళ్లు, ఇతర ఖర్చుల నిమిత్తం బ్యాంకులకు కుదవ పెట్టను కూడా వీలు లేని పరిస్థితి కల్పించారు. లక్షల కోట్ల ఖర్చు అయ్యే పరిశ్రమ... ఒకవేళ ఏదన్నా ప్రమాదం సంభవిస్తే ఇవ్వాల్సిన సివిల్ న్యూక్లియర్ లయబిలిటీ కేపింగ్‌ను కేవలం 1300 కోట్లకు తగ్గించి కార్యక్రమాన్ని అమలుచేయడం అవసరమా. ఏ ప్రమాదం జరిగినా అటు మహానది, ఇటు గోదావరి మధ్యన గల జీవావరణ వ్యవస్థలన్నీ కోలుకోలేనంతగా దెబ్బతింటాయి. చెర్నోబిల్ దురంతం తర్వాత ఇంత వరకూ ఏ ఒక్క రియాక్టరు కూడా ఎక్కడా పని ప్రారంభించలేదు. కాబట్టి చెర్నోబిల్ ప్రమాదానికి గురైన రియాక్టర్లలోని లోపాలను సవరించామని ఈ పెద్ద దేశాల అణు రియాక్టర్ తయారీ కంపెనీలు చెప్పేవన్నీ కేవలం అంచనాలు మాత్రమే తప్ప నిరూపిత సామర్థ్యాలు కావు. అది వెస్టింగ్ హౌస్ ఎ.పి 1000 అయినా రొసాటమ్ ఎఇఎస్ 2006 అయినా అరెవా ఇపిఆర్ అయినా ఇవన్నీ ఎన్నో ఏళ్ళు తయారీ దశలోనే ఆలస్యానికి గురి అవుతున్న రియాక్టర్ ప్రాజెక్టులు. ఫుకుషిమాలో జరిగినటువంటి సునామీ ప్రమాద సంభవం నుంచి కొవ్వాడ ప్రాంతాన్ని వేరుగా చూడలేం.. ఎందుకంటే ఈ కొవ్వాడ ప్రాంతం సునామీ రెడ్ జోన్‌లో ఉందని ప్రొఫెసర్ వివేక్ మాంఝూరియో వివరించారు. ఈ ప్లాంట్ ఏర్పడి పని ప్రారంభిస్తే 300 టన్నుల దాకా పారిశ్రామిక వ్యర్థాలు ఏర్పడతాయనీ, ఆ మొత్తంలో 3 టన్నుల వరకు ఫ్లుటోనియం ఉంటుందని తెలిపారు. ఈ ఫ్లుటోనియం పలు రకాల జీవావరణ వ్యవస్థలకు ప్రాణాంతకమైందనీ, దీని లీకేజీ జరిగితే చుట్టు పక్కల 1000 కి.మీ.ల వరకూ రేడియేషన్ వ్యాపిస్తుందని, రాబోయే తరాలను, పుట్టబోయే బిడ్డలపై ప్రభావం చూపిస్తుందని హెచ్చరించారు. జపాన్‌లో ఫుకుషిమా ఉన్న భౌగోళిక ప్రాంతం వంటిదే కొవ్వాడ కూడా అని వివరిస్తూ...



రియాక్టర్ల పేలుడు తర్వాత ప్రభుత్వం వందల హెక్టార్ల అడవులను తొలగించి, విష కలుషిత రసాయనాల నిల్వకి ఎన్నో ట్యాంకులు కట్టిందనీ అయినా అక్కడ పరిస్థితి అదుపులోకి రావడం లేదని సమాచారమిచ్చారు. నలభై ఐదు వేల కోట్లకు పైగా (ప్రస్తుత అంచనాల ప్రకారం) ఎక్కడా, ఏ అణు ప్లాంటులోనూ, ప్రపంచంలో ఇంతకు ముందు పనిచేయని, ఇంకా ప్రయోగాత్మక దశలోనే ఉన్న త్రీ జనరేషన్ ప్లస్ రియాక్టర్లు అంటూ వివిధ బ్రాండ్ పేర్లతో విదేశాలు అమ్మజూపుతున్న అణు విద్యుత్ రియాక్టర్లు భద్రతతో పనిచేస్తాయన్న హామీ ఎక్కడా లేదు. సాధారణ పనికాలం ముగిశాక (30-40 ఏళ్లు) అణు రియాక్టర్ల డీ-కమీషనింగ్‌కు భారీగా ఖర్చవుతుందని అమెరికా, జపాన్ ప్లాంట్ల మూసివేత సందర్భంలో తెలుస్తోంది. అమెరికా లోని 185 మెగా వాట్ల ప్లాంట్ డీ-కమీషనింగ్‌కు 608 మిలియన్ డాలర్లు, 860 మెగా వాట్ల ప్లాంట్ మూసివేతకు 635 మిలియన్ డాలర్లు ఖర్చు అయ్యింది. ఇక ప్రమాదం జరిగి పేలిపోయిన ఫుకుషిమా రియాక్టర్ల మూసివేతకు తగు సాంకేతికత ఇంకా కనుక్కోబడలేదు. నష్టాన్ని ఆపడం సాధ్యపడటం లేదు. వాటిని డీ-కమీషనింగ్ చేయాలంటే కోట్ల కోట్ల డాలర్లు కావాలని వేసే అంచనాలు చూసైనా జాగ్రత్త పడాలి.

ప్రత్యామ్నాయాలెన్నో

అణు విద్యుత్ నుంచి దూరంగా తొలగిపోతున్న దేశాల్లో డెన్మార్క్ గాలిమరల దేశంగా తన దేశపు అవసరాల్లో యాభై శాతం వరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. ఫ్రాన్స్‌లో తమ అణు విధానాన్ని పూర్తిగా తిరగరాసుకుని కొన్నేళ్లలో తాము అణు ఇంధన ఆధారిత విద్యుత్ నుండి పూర్తిగా విముక్తం అవుతామని సాక్ష్యాత్తు ఫ్రాన్స్ అధ్యక్షురాలే ప్రకటించారు. యూరప్‌లో అవసరం లేకుండా పోతున్న అణు పరిశ్రమలను ఆసియా దేశాలకు తరలించే ప్రక్రియలో భాగంగానే ఇప్పుడు జరుగుతోంది.తాము తయారు చేసిన అణు బాంబుల సంఖ్య తగ్గించాక ఆ అణు ఇంధనానికి మార్కెటు కోసం... ఈ అణు సాంకేతిక ఆధిపత్య ప్రపంచంలో ప్రముఖ స్థానం కోసం అగ్రరాజ్యాలు ప్రోత్సహిస్తున్న అణు పరిజ్ఞాన ఆధారిత పరిశ్రమలు ఇవి. దీని నుంచి పక్కకు తొలగి దేశంలోనున్న సుసంపన్న జల వనరులు, గాలి మరలు, సోలార్ పానెల్స్, బయోగ్యాస్ పద్ధతుల ద్వారా దేశ అవసరాలకు తగు విద్యుత్‌ను ఉత్పాదన చేయాలి. అణు రక్కసితో ఆటలాడటం మంచిది కాదు. న్యూక్లియర్ టెక్నాలజీ అంటే నో క్లియర్ టెక్నాలజీగా గుర్తించాలి.

డూమ్స్ డే క్లాక్

1947లో మొదటిసారిగా డూమ్స్‌డే క్లాక్ ఏర్పాటు చేసింది 'బులెటిన్ ఆఫ్ అటామిక్ సైంటిస్ట్స్' నిర్వహించే 'సైన్స్ అండ్ సెక్యూరిటీ బోర్డ్'లో 18 మంది నోబెల్ బహుమతి గ్రహీతలున్నారు. అప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా అర్ధరాత్రి నుంచి ఏడు నిమిషాల వ్యవధిలో (23:53 దగ్గర) ఈ గడియారపు ముళ్ళను స్థిరపరిచారు. ఈ 70 ఏళ్ళలో మనం మూడు నిమిషాల వ్యవధికి చేరుకున్నాం. ఇప్పటి అంచనాలకు పర్యావరణంలో వచ్చిన మార్పులు, అణ్వాయుధ వ్యవస్థల ఆధునీకరణ, భారీ ఎత్తున పెరిగిన అణ్వస్త్రాల శక్తి, సామర్థ్యాలు, వాటి నిల్వలకు తోడు అణు విద్యుత్ రియాక్టర్లు, వాటి నిర్వహణ లోపాలు, పెను నష్టాలు కూడా పరిగణనలోకి తీసుకున్నారు.

రస్సెల్-ఐన్‌స్టీన్ మానిఫెస్టో

ప్రపంచం ఎదుర్కొంటున్న అణు యుద్ధ ప్రమాదం తీవ్రతరం అవుతున్న పరిస్థితులను గమనించి సామాజిక మేధావి రచయిత బెర్ట్రాండ్ రస్సెల్ పిలుపు మేరకు ఆనాటికి ప్రపంచంలో అగ్ర గణ్యుడైన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో సహ దేశదేశాల శాస్త్రజ్ఞులు శాంతిని కాపాడుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఉందంటూ 1955 జులై 9 సంయుక్త ప్రకటన చేశారు. దీనినే రస్సెల్-ఐన్‌స్టీన్ మ్యానిఫెస్టో అంటారు. సంతకం చేసిన వారిలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ బెర్ట్రాండ్ రస్సెల్‌లతో పాటు అమెరికా జన్యు శాస్త్రవేత్త హెర్మాన్ ముల్లర్, జపాన్ శాస్త్రవేత్త, ఆ దేశపు తొలి నోబెల్ బహుమతి గ్రహీత హిదెకియకావా, భౌతిక శాస్త్రవేత్త మేక్స్ బార్న్, అమెరికాకు చెందిన శాంతి ఉద్యమ కార్యకర్త, శాస్త్రవేత్త, ఇంజినీరు, రచయిత, ఉపాధ్యాయుడైన లినస్ పాలింగ్, పోలండ్ దేశీయుడైన భౌతిక శాస్త్రవేత్త లెపోల్డ్ ఇన్‌ఫెల్డ్, బ్రిటీషు భౌతిక శాస్త్రవేత్త సెసిల్ ఫ్రాంక్ పావెల్, నోబెల్ బహుమతి పొందిన శాస్త్రజ్ఞుడు ఫ్రెడరిక్ జొలియట్ క్యూరీ, ఫ్రెంచ్ భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత పెర్సీ విలియమ్స్ బ్రిడ్జిమాన్, నోబెల్ గ్రహీత అందరికన్నా చిన్నవాడైన జోసెఫ్ రాట్ బ్లాట్ ఉన్నారు.

హిరోషిమాపై బాంబు దాడికి అరవై ఏళ్ళు పూర్తయిన సందర్భంలో 2007లో ఈ సంతకం దారుల్లో బతికి ఉన్నది ఒక రాట్ బ్లాట్ మాత్రమే. అప్పటికి ఆయనకు 97 ఏళ్ళు. ప్రపంచాన్ని అణు మహమ్మారి నుంచి విముక్తం చేయడం కోసం తుదికంటా పోరాడారు.



కుక్క పాలు తాగుతాడు

పాటలీపుత్రకు దగ్గరలోని మనైతానంద్‌కు చెందిన మోహిత్ కుమార్‌కు కుక్క పాలంటే ఇష్టం. ఎలా అలవాటైందో గానీ వీధి కుక్కల పాలను తాగంంంకుండా ఉండలేడు. పుట్టుమూగ అయిన మోహిత్‌కు పదేళ్లు. నాలుగేళ్లప్పటి నుంచే కుక్క పాలను నేరుగా తాగుతున్నాడని తల్లిదండ్రులు చెబుతున్నారు. అతనెందుకలా చేస్తున్నాడో ఇంట్లో వారికి పాలుపోవడం లేదు. మోహిత్ కూడా వివరించి చెప్పలేడు. ఓ సారి వేరే ప్రాంతంలో వీధి కుక్క పాలు తాగబోతే అది కరిచింది. అప్పటి నుంచి మోహిత్ బయటకు వెళితే ఎవరో ఒకరు కనిపెట్టుకుని ఉంటున్నారు. బడి కూడా మాన్పించారు. అయినా వీలు చిక్కినప్పుడల్లా ఇంటి నుంచి పారిపోయి వీధి కుక్కల పాలు తాగొస్తున్నాడు. స్థానిక వైద్యులకు చెబితే కుక్క పాలతో ఇబ్బంది లేదు కానీ రేబీస్ వంటి ప్రాణాంతక వ్యాధులు వీధి కుక్కల వల్ల వస్తాయని హెచ్చరించారు.

వింత లోకం

నవ్వించే ఉల్లి

ఉల్లితో ఇక కన్నీళ్ల లొల్లి ఉండదంటోంది ఓ జపనీస్ కంపెనీ. ఉల్లిపాయల్ని కోసేటపుడు కన్నీరు రాకుండా నవ్వు విరబూయిస్తుందంటోంది హౌజ్ ఫుడ్స్ ఆహార సంస్థ. 2002లో వీరు చేసిన పరిశోధనలో కన్నీళ్లకు కారణమయ్యే సిన్ ప్రొపెంథియాల్-యస్-ఆక్సైడ్ అనే లాక్రిమేటరీ ఏజెంట్, ఎంజైమ్‌లను ఉల్లి రుచి, పోషక విలువలకు ఏ మాత్రం తేడా రాకుండా బలహీన పరచవచ్చని తేలింది. అప్పటి నుంచి ఉల్లిపాయలపై రకరకాల ప్రయోగాలు చేసి చివరకు కన్నీళ్లకు చెక్ పెట్టారు. ఉల్లిని కత్తితో గాటు పెట్టగానే దాని అణువులు విచ్ఛిన్నమై లాక్రిమేటరీ ఏజెంట్ విడుదలవుతుంది. ఇలా కాకుండా ఉల్లిపాయలను చిల్ చేసినట్టయితే అణువుల కదలిక తగ్గి ఏజెంట్ విడుదలవదు. వీటికి 'స్మైల్ బాల్' అని పేరు కూడా పెట్టేశారు. ఉల్లికి ఘూటు లేకుంటే యాపిల్ వంటి రుచిని కలిగి ఉంటుంది. టోక్యోలో ట్రయల్ రన్‌లోనే 5 టన్నుల స్మైల్ బాల్స్‌ను అమ్మేశారు. భారీ ఎత్తున మార్కెట్‌లోకి తెచ్చే ప్రయత్నంలో ఉన్నారు. కానీ కొందరు ఆహార నిపుణులు మాత్రం యాపిల్ ఎలాగైతే ప్రయోగాల వల్ల అసలు ఫ్లేవర్‌ను కోల్పోయిందో అలాగే ఉల్లి రుచి అయిపోతుందని బాధ పడుతున్నారు. అంటే మనం తింటున్న యాపిల్‌కు వాటి ఒరిజినల్ ఫ్లేవర్ లేదా! ఏమో.



ఛ్ఛ్... కలవలేదు

పీటర్ సర్క్‌ది హోలండ్.. అతడి ప్రియురాలు ఝూంగ్‌ది చైనా. ఇద్దరినీ కలిపిందో సామాజిక మాధ్యమం. ప్రేమలో పడ్డారు. ఐ లవ్యూలు చెప్పుకున్నారు. ఫోటోలు షేర్ చేసుకున్నారు. ఇలా ఎంత ఆన్‌లైన్‌లో కలిసే ఉన్నా కూడా ఏదో వెలితి. వారిద్దరి మధ్య 4500 కి.మీ. దూరం. అందుకే పీటర్ ఝూంగ్‌ను వెతుక్కుంటూ చైనా వచ్చేశాడు. విమానాశ్రయంలో వేచి వుంటానని సందేశమిచ్చాడు. రెండు చేతులా హత్తుకుని ఆహ్వానిస్తుందనుకున్న ప్రేయసి మాత్రం రాలేదు. ఓ రోజు గడిచింది. ఏదో ఇబ్బంది పడుతుందేమోలే ధైర్యం తెచ్చుకుని వచ్చేస్తుందిలే అని ఎదురు చూశాడు. రెండో రోజు, మూడో రోజు ఇలా పది రోజులైపోయాయి. అయినా ఝూంగ్ జాడ లేదు. ఆన్‌లైన్‌లోను టచ్‌లో లేదు. ఆమెకు ఏమైంది. వారి బంధానికి ఏమైంది. దిగులు పెట్టుకున్నాడు. ఏం తినలేక పోయాడు. జబ్బున పడ్డాడు. చివరకు పీటర్ పరిస్థితి చూడలేక విమానాశ్రయ సిబ్బందే అతణ్ని బెంచ్ మీది నుంచి లేపి చేతికి సెలైన్ ఎక్కిస్తూ ఆస్పత్రికి చేర్చారు. ఈ విషయం మీడియాకు తెలీడం ఝూంగ్‌ను వెతుక్కుంటూ వెళ్లారు. అప్పుడు తెలిసింది.. ఝూంగ్ ప్లాస్టిక్ సర్జరీ కోసం వేరే ఊరు వెళ్లిందని, పీటర్ సందేశాలు చూడలేకపోయిందని. ఏదో తమాషాకు అన్నాడులే ఎందుకు అంత దూరం నుంచి నా కోసం వెంటనే వచ్చేస్తాడని అనుకుందట. ఆమె అక్కడికి చేరుకునే లోపు పీటర్ ఆరోగ్యం మెరుగుదల కోసం హోలండ్‌కు పంపేశారు. మరి ఈ సారి పీటర్‌ను వెతుక్కుంటూ ఝూంగ్ వెళుతుందేమో. ఆన్‌లైన్ ప్రేమలు.. పలు తిప్పలు.

అసహనంపై అవగాహన

'అసహనం' హద్దులు దాటి పోయింది. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ అసహనం సరిహద్దులు దాటి దేశాన్ని చుట్టు ముట్టింది. మతోన్మాదులు ముస్లిమ్ మైనారిటీలు, దళితులు, మహిళలపై దాడులకు తెగబడుతున్నారు. దేశంలో పేరెన్నిక గన్న హెచ్‌సియు, జేఎన్‌యు లాంటి విశ్వవిద్యాలయాలు సైతం సంఘ పరివార్ శక్తుల దాడులకు గురవుతున్నాయి. జాతి వ్యతిరేకులు, దేశ ద్రోహులు, గోవు భక్షకులు అనే ముద్రలు వేసి హత్యలు చేసి, జైళ్లలోనెట్టి, కోర్టుల్లోనే కొట్టి దేశ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టారు.

దేశ పౌర సమాజాన్ని అతలాకుతలం చేస్తున్న సంఘటనల పరంపరను, వాటి లోతు పాతులను మనం అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. మతోన్మాద శక్తులు సంస్కృతి, సాంప్రదాయాల పేరుతో మన విద్యావ్యవస్థపై దాడి చేయటాన్ని దేశం యావత్తూ ఖండించాలి. ప్రజాస్వామ్యాన్ని బూచి చేస్తూ, చట్టాలు ఏవిధంగా ఉల్లంఘిస్తున్నారో రోహిత్ ఆత్మహత్య, కన్హయ్య అరెస్టులు మనకు తెలుపుతున్నాయి. కులం, మతం ప్రాతిపదికగా సామాజిక పెత్తనం చెలాయించాలనుకుంటున్న ఉన్మాదులు దేశ భవిష్యత్‌కే ప్రమాదకరంగా మారారు. వీటి లోతు పాతులు తెలుసుకోవటానికి "స్వేచ్ఛా ప్రజాస్వామ్యులపై మతోన్మాదుల దాడి" పుస్తకం మనకెంతో ఉపయోగ పడుతుంది. పేరొందిన న్యాయకోవిదులు, ఆర్థిక వేత్తలు, రాజకీయ నాయకులు, విద్యార్థి నేతలు వివిధ కోణాల నుండి రాసిన వ్యాసాల సంకలనమీ పుస్తకం. 30

స్వేచ్ఛా ప్రజాస్వామ్యులపై
మతోన్మాద దాడి
సంకలనం :
గద్దం కోటేశ్వరరావు
వెల: 100/-
పేజీలు-136
ప్రతులకు-విశాలాంధ్ర
పబ్లిషింగ్ హౌస్

వ్యాసాలున్న ఈ పుస్తకం మనకు చాలా సమాచారం అందిస్తుంది. సాధారణ చదువరులను సైతం ఆకట్టుకునే అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

- భవిష్య

చైతన్యం నింపే కవితా జ్యోతులు

ఈ కవితా సంపుటిలోని ప్రతి అక్షరం అంబేద్కర్ భావజాలపు వెలుగులో చైతన్య కిరణం. ఈ కవితా సంపుటి సామాజిక, ఆర్థిక, రాజకీయ వివక్షలపై సంధించిన అక్షర తూణీరం. దళితుల ఐక్యత, ఆత్మాభిమానం, సామాజిక న్యాయం, రాజ్యాధికారం వంటి అంశాలపై కవి హృదయ స్పందనే ఈ కవితా సంపుటి. రచయిత చింతా అప్పారావు ఆంగ్ల భాషా అధ్యాపకులైనప్పటికీ సరళమైన భాషలో వ్యవస్థలోని లొసుగుల ముసుగుల్ని తొలగించి, వ్యవస్థ స్వరూపాన్ని, ఆయా వర్గాల భావోద్వేగాలను స్పష్టంగా, నిర్మొహమాటంగా వెల్లడించారు. 'చైతన్య జ్యోతులు' అనే ఈ పుస్తకంలో 114 పేజీలో 60 కవితలతో పాటు కొన్ని వ్యాసాలు, పరిచయ వాక్యాలను పొందుపరిచారు. ఈ మొత్తం కవితల్లో సమకాలీన పోకడలకు అద్దంపట్టే లోతైన పరిశీలన కనిపిస్తుంది. ఇది రచయిత ఆలోచనలకు, భావాలకు నిలువుటద్దం అని చెప్పొచ్చు.

'ఊరేదైనా కన్నీరు ఒక్కటే' కవితలో... మానవత్వానికి కులం లేదనే సందేశాన్నిస్తే.. 'పేదల బతుకు' కవితలో... పేదల బతుకు- ఉడకని మెతుకు/ తింటే అజీర్ణం - తినకుంటే మృత్యువర్ణం... అంటూ ఇది మారాలంటే 'కులం

చైతన్య జ్యోతులు
రచన: చింతా అప్పారావు.
పేజీలు: 114
వెల: 70
ప్రతులకు: సిహెచ్ సత్యవతి,
తిరువూరు, కృష్ణా

లేని జాతీయ నేత, మతంలేని ప్రవక్త మనల్ని పాలించాల'ంటూ తన మనసులోని భావాల్ని స్పష్టం చేస్తారు. 'నీవులేక మేము లేము' కవితలో... మట్టి తట్టలు మోసిన బిడ్డలను/ మట్టిలో మాణిక్యాలుగా మలిచినావు' అంటూ అంబేద్కర్ గొప్పదనాన్ని విశ్లేషిస్తారు కవి.

'నత్త మా మేనత్త' కవితలో... 'నత్త తన మీద గూటిని మోసుకెళతది... కులం కుంపటి మా నెత్తిన మోయాల్సి వస్తోంది' అంటూ... వ్యంగ్యోక్తులు విసిరినా, ఎక్కడికెళ్లినా నత్త గూడులా కుల శిరోభారం మమ్ము వెంటాడుతోందంటూ ఒకింత ఆవేదననూ వ్యక్తం చేస్తాడు రచయిత. 'కులమే ఒక విచిత్ర గణిత శాస్త్రం' కవితలో... 'మన దేశంలో కులమే ఒక విచిత్ర గణిత శాస్త్రం/ కులమే ఒక కూడిక, ఒక తీసివేత, ఒక వెలివేత' అంటూ... కులం లెక్కలను... మనువు రాతలను... దళితులు అనుభవిస్తున్న వెలివేతలను, తీసివేతలను తూర్పారబడుతూ, 'కులమే ఒక పెంట కుప్పయితే, స్వచ్ఛభారత్ ఎలా సాధ్యం? అంటూ... ఆధునిక సమాజాన్ని నిగ్గదీస్తాడు రచయిత.

ఈ కవితా సంపుటిలోని చాలా కవితలు అంబేద్కరిజాన్ని ప్రతిబింబిస్తాయి. కులం, మతం, అణచివేతలతో పాటు ప్రపంచీకరణ ప్రభావంతో బహుజనులు ఎదుర్కొంటున్న ప్రతి అంశాన్ని స్పృశించారు. వీటన్నింటి నుంచి విముక్తికి అంబేద్కర్ భావజాలం మాత్రమే ఏకైక మార్గమని, నేటి యువతరానికి పూలే, అంబేద్కర్ భావజాలాన్ని అందించాలనే సంకల్పమే ఈ చిన్న ప్రయత్నమని చెబుతూ... 'నా కవితలు అందమైన అమరావతి శిల్పాలు కాకపోవచ్చు.... కానీ ఆలోచింపచేసేందుకు అక్షర రూపం దాల్చిన చైతన్య జ్యోతులు' అని రచయిత చెప్పుకుంటారు.

చివరిగా ఈ కవితల్లో రచయిత తాను చెప్పదల్చుకున్న భావానికే ప్రాధాన్యతనిచ్చారు తప్ప... శైలిని, పదాల కూర్పును వదిలేశారు. ఈ జాగ్రత్త కూడా తీసుకొనివుంటే ఈ కవితలకు మరింత వన్నె వచ్చేదని చెప్పవచ్చు.

- రాజాబాబు కంచర్ల



అమ్మ ఒడిని వీడా
తొలి తోడే స్నేహి.
పంచుకునేది స్నేహి
పెంచుతుంది. భావా
కాదు కష్టాల్లోనూ మ
అలాంటి స్నేహితులం
చేసుకుంటూ ఏటా జ

స్నే

తమ భావాలని ఇతరులతో పంచుకోడానికి స్నేహం అవసరమవుతుంది. ఇరువురి మధ్య ప్రేమ చిగురించడానికి ముందు స్నేహం బలపడుతుంది. మనిషి మనుగడకి స్నేహం చేయూతనిస్తుంది. పాఠశాల దశలో, కాలేజీ చదువులో, ఆఫీస్‌లో ఎంత మంది పరిచయస్తులున్నా నిజమైన మిత్రులు మాత్రం కొందరే ఉంటారు. ఈ ప్రపంచంలో విలువైన వస్తువులు అంత తేలిగ్గా దొరకవంటారు. అందుకే నిజమైన స్నేహుతులు కూడా అరుదుగానే లభిస్తారు. అలాంటి స్నేహబంధాన్ని బలపరుచుకునేందుకు దాదాపు అన్ని దేశాల్లో స్నేహితులందరూ కలిసికట్టుగా జరుపుకుంటున్న ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు మొదట దక్షిణ అమెరికాలో ప్రారంభమయ్యాయి.

ప్రాణ మిత్రుల కథే

1935 ఆగస్టు మొదటి శనివారం రోజు అమెరికా ప్రభుత్వం చేతిలో హతమైన తన స్నేహితుని మరణాన్ని తట్టుకోలేక మరో మిత్రుడు తర్వాతి రోజు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో చలించిన అమెరికన్ కాంగ్రెస్ 1935 ఆగస్టులోని మొదటి ఆదివారాన్ని జాతీయ స్నేహితుల దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుంచి స్నేహితుల దినోత్సవాన్ని అమెరికాతో పాటు రష్యాలోని కొన్ని దేశాల్లో వార్షికోత్సవ వేడుకలుగా జరుపుకుంటున్నారు. తొలి దశలో దక్షిణ అమెరికాలోని పెరగ్వే వంటి దేశాల్లో 1919లో కార్డుతో సందేశాల్ని పంపుతూ స్నేహితులపై తమకున్న అభిమానాన్ని చాటుకునేవారు. అలా గ్రీటింగ్ కార్డుల ద్వారా సందేశాల్ని ఇచ్చిపుచ్చుకునే ఈ సంప్రదాయం పాశ్చాత్య దేశాల్లో మొదలైనా సాంకేతిక రంగంలో వచ్చిన మార్పుల ద్వారా దక్షిణ ఆసియా ఖండంలోని ఇండియా, బంగ్లాదేశ్, మలేషియా వంటి దేశాల్లో ప్రవేశించడంతో చిన్నా పెద్దా తేడాలేకుండా అందరూ ఫ్రెండ్‌షిప్‌డే వేడుకల్ని జరుపుకుంటున్నారు. వివిధ దేశాల్లో స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించే తేదీల్లో మాత్రం వ్యత్యాసాలున్నాయి. దక్షిణ ఆసియా ఖండాల్లోని కొన్ని దేశాల్లో ఆగస్టు మొదటి ఆదివారాన్ని స్నేహితుల దినోత్సవంగా జంరుపుకుంటారు. బెర్లిన్, ఒహియో నగరాల్లో ఆగస్టు 8న స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

బ్యాండ్‌తో కట్టేసి..

మిత్రులపై తమ అభిమానాన్ని వ్యక్త పరుస్తూ ఇచ్చిపుచ్చుకునే గ్రీటింగ్ కార్డులు, రంగు రంగుల పూలు ఇలా ఎన్నున్నా ఫ్రెండ్‌షిప్ బ్యాండ్, రిస్ట్ బ్యాండ్‌కున్న ప్రత్యేకత వేరు. స్నేహితుల దినోత్సవం రోజు చాలా మంది చేతులు మిత్రులు కట్టే రంగురంగుల ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ వారి స్నేహానికి ప్రతీకగా కనిపిస్తుంది. ఇలా ఒకరికొకరు కట్టుకునే ఈ బ్యాండ్స్‌తో ఎన్నో పాత జ్ఞాపకాలు ముడిపడి ఉంటాయి. ప్రస్తుతం వందలాది డిజైన్లు, అల్లికల్లో, వివిధ రంగుల్లో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ లభిస్తున్నా రంగు దారాలతో చేసిన బ్యాండ్స్ క్రీస్తుపూర్వం 4వ శతాబ్దం నుండే వాడుకలో ఉన్నాయి.

చైనా కళాకృతుల్లో భాగంగా 420-220 బి.సి. మధ్య కాలంలో రంగు రంగు దారాల అల్లికలతో చేసిన కంకణాలు తొలి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్‌గా రూపుదిద్దుకున్నాయి. ఎలాంటి అల్లికలు, నేత అవసరం లేకుండా వివిధ ఆకృతుల్లో దారాల్ని ముడివేసి అందంగా తీర్చిదిద్దే మరో హస్తకళ మధ్య ప్రాచ్యదేశాల్లో దర్శనిమిస్తుంది. ఈ కళలో మధ్య ప్రాచ్య దేశాల్లోని నావికులందరూ సుప్రసిద్ధులు. వివిధ ఆకృతుల్లో తాళ్లని ముడివేసి

అందంగా తయారుచేసిన వాటితో
అలంకరించేవారు. అర్ధచతురస్రం,
దారాల్ని తమ నౌకల్లో ప్రయాణించ
కట్టేవారు. సులభంగా తయారు చే
పెరగడంతో అధికంగా దారాల్ని ఉ
చేయడం ప్రారంభించారు. దీంతో
అరేబియాలోని వస్త్ర పరిశ్రమలో పె
చోటుచేసుకున్నాయి. ఈ తరహా అ
పాటు చుట్టుపక్కల దేశాల్లోనూ ఫ్రె
అనుకరించేవారు. ఇలా ఎన్నో మార
ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ 70వ దశకంలో

. నాన్న చేయి వదిలాక మనకి దొరికే
ందాన్నయినా కష్టాన్నయినా ముందు
తోటే. స్నేహం సంతోషాన్ని
పంచుతుంది. ఆనందంగా ఉన్నప్పుడే
ల్ని వెన్నంటి నడిపించే వారే స్నేహితులు.
దరూ కలిసి తమ జ్ఞాపకాల్ని గుర్తు
సుపుకునే వేడుకే స్నేహితుల దినోత్సవం.

హమంటే ఇదేరా



కల్ని అందంగా
తురస్రాకారంలో ముడివేసిన
వారికి స్నేహపూర్వకంగా
ఈ అల్లికలకి ఆదరణ
గించి మరిన్ని ఆకృతుల్ని
3వ శతాబ్దంలో సౌదీ
ు మార్పులు
కల్ని మధ్య ప్రాచ్య దేశాలతో
ప్ బ్యాండ్స్ తయారీలో
లతో అల్లికల రూపంలో
మెరికాలోకి ప్రవేశించాయి.

అంతర్జాతీయ ఫ్రెండ్షిప్‌డే ప్రతిపాదన

జాతి వివక్షను దూరం చేసేందుకు అంతర్జాతీయంగా ఫ్రెండ్షిప్ డేని నిర్వహించాలని అమెరికాకు చెందిన డా.అర్టీమియో బ్రాకో తొలుత 1950 జులై 28లో ప్రతిపాదించాడు. తన మిత్రులతో కలిసి ఒక విందులో పాల్గొన్న సందర్భంలో అర్టీమియో బ్రాకోకి ఈ అలోచన స్ఫురించడంతో మెక్సికోలోని ప్యూర్టొ పినాస్కో అనే ఒక చిన్న గ్రామంలో ఫ్రెండ్షిప్ డే వేడుకల్ని నిర్వహించారు. అప్పటి నుండి అమెరికాతోపాటు చుట్టుపక్కల చిన్న దేశాల్లో ప్రతి సంవత్సరం జులై 30న జాతి, కుల, మతాలకి అతీతంగా ఫ్రెండ్షిప్ డే వేడుకలు జరిగేవి. దక్షిణ అమెరికాలోని పెరుగ్వేలో 1958లో అధికారికంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు మొదలయ్యాయి. 2011 ఆగస్ట్ 29న ఐక్యరాజ్య సమితి జులై 30వ తేదీని అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవంగా ప్రకటించింది. కానీ మనదేశంతోపాటు మరికొన్ని దేశాల్లో ఆగస్ట్ తొలి ఆదివారం స్నేహితుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. తేదీలతో ఏముంది కానీ స్నేహం విలువ తెలిస్తే చాలు.

రంగుకో లక్షణం

ఎరుపు, పసుపు గులాబి, నీలం ప్రధాన రంగులుగా తయారుచేసే ఫ్రెండ్షిప్ బ్యాండ్స్‌లో ఒక్కో రంగులో ఒక్కో ప్రత్యేక లక్షణం దాగుంది. ఎరుపు, గులాబి రంగులు నిజాయితీ, దయా గుణానికి సూచికలు. కాషాయం శక్తివంతమైన లక్షణానికి, పసుపు రంగు ఉల్లాసానికి చిహ్నాలు. నీలి రంగు బాధ్యతకి, విధేయతకి సంకేతమైతే నలుపు రంగు ధృఢత్వానికి నిదర్శనం. మరి ఈ సారి ఫ్రెండ్షిప్ డేకి మీ మిత్రులు కట్టే ఫ్రెండ్షిప్ బ్యాండ్‌ల ద్వారా వారిలో ఏ లక్షణాలు దాగున్నాయో గుర్తించండి.

ఒరేయ్ అమీగో...



చిన్నా పెద్దా, పేద ధనిక అంతరాలులేని స్నేహబంధంలో కీలక వ్యక్తి మిత్రుడు. హోదా, స్థాయి, నేపథ్యంతో పాటు ధనిక, బీద ఇలా ఏ అంతరాలు పట్టించుకోకుండా అరెయ్..ఒరేయ్ అనుకునే స్నేహం ప్రాణ మిత్రుల్ని వివిధ భాషల్లో ఎలా పిలిపిస్తుందో తెలుసా.

చైనా - పెన్‌గ్యూ, డచ్ - ఫ్రీయ్‌ంద్
ఫ్రెంచ్ - అమీ, జెర్మని - ఫ్రూండ్
హంగెరీ - బేరత్, భారత్ - దోస్త్
ఇటలీ - అమీగో, జపాన్ -టొమొడచి
కొరియా - జిన్గు, రష్యా - ప్రిజటెల్
స్పెయిన్ - అమిగొ, ఇండొనేషియా - టిమెన్
హిందీ-మిత్ర, బెంగాలీ-బంధూ
మరాఠీ-మిత్ర్, తమిళం-నాన్బన్
తెలుగు- స్నేహితుడు, కన్నడ-గెలెయ

స్నేహమనేది ఎన్నటికీ ఒక మధురమైన బాధ్యత ... అది ఎప్పుడూ ఒక అవకాశం కాదు

- ఖలీల్ గిబ్రాన్

- శర్వాణి

సరళమూ
సున్నితమూ
ప్రభావవంతమూ
మరెంతో లోతైన
సరికొత్తదైన ఓ భావ పరంపరలా
నిశితమైన నువ్వు జనించాలంటే
తప్పని సరిముడి పదార్థమేగా
అందమైన ఓ ఏకాంతమూ
నిన్నొక ఆరోహణలో పొందికగా
చిగురిల్లజేసే ఓ తీరికైన తొలకరిగానో
చెల్లా చెదురుగా నిన్ను విసిరేసే
అవరోహణలో వాడైన సుడిగాలిగానో
అలవోకగా గిరాటేసి
నువ్వు మాత్రమే మిగిలిన నిన్ను
పలకరించే శక్తి తనదేగా మరి
నీ నీడ ఒక్కటి నీకు తోడుగా
పైపైన అలసటలను వేరుచేసేసి
మృత్యువంత నిశ్చలంగా పరుచుకున్న
ఏకాంతంలో
ఓ రాత్రిని నిక్షిప్తం చూడు
అందమైన ఓ కొంగొత్త వేకువతో
అత్యంత నిశ్శబ్దం
లోలోపలి నడిరేయి భూకంపం
జాడలుండవు నీలో
పణంగా ఒడ్డిన మనసులో కుదేలైన అహం
తప్ప
వెతల తాకిడికి మునిగిపోయిన కలలతో
భారరహితంగా మారి శుష్కపత్రమైన
జీవితం
గాలివాటుగా దాటవేస్తున్న క్షణాలన్నీ
వక్కాణిస్తుంటాయ్ కొత్త ఉనికిని
స్వప్నాలను వెలికితీతతో
తొలిసారి విచ్చుకున్నప్పటి
నీ చూపుతో పాటే
నీతో పరుగెడుతూ
అడుగడునా నీ అడ్డుతో అలిసిపోయి
వెనకబడిన
ఓ ప్రశాంతత
నిన్ను నీకు మరింత స్పష్టంగా
అప్పచెప్పుకున్నాక
లేచి కళ్ళ ముందు విరిసి విస్తరిస్తుంది
ఆ కళ్ళే
మిగిలిన పయనానికి
నీ కథాగమనం నీ నడకలోనే ఇక
ఏ ఉద్విగ్నతా తారుమారు చేయలేని ఓ
భావోద్వేగంగా
కలల అడుగుల గుమ్మం తొక్కి
వాస్తవాల విడిదింటికో శాశ్వత
యజమానిగా
ఎవరు వేరుకట్టగలరు
నీ నుండి నిన్ను
ఓ నిశితమైన నీకు
మరో మనుగడనివ్వకుండా?

- **అనిల్ ధ్యాని**
9703336688

అమ్మో! అణువులతో ఆటలా?

ఆంధ్రుడిగానే ఉండనివ్వు-
అమెరికాతో పోలికలొద్దు
చికాకోలు చిన్నోడిని- సింగపూర్
సోకులొద్దు
అణువిద్యుత్ ఆశలొద్దు- సౌర
విద్యుత్ చవకగా పొందు
అణుకాలుష్యంతో కడలిని
ముంచకు -అలల శక్తితో దివ్వెలు
వెలిగించు
రాజధానికై అడవులను ఆక్రమించే-
మీ మాటలు నమ్మేవారెవరండీ
రాచరికాలెన్నో మట్టికరిపించిన
నేల- బడాయి మాటలు చెల్లవీడ
పల్లెపల్లెకూ రథయాత్రలు చేయు-
మంచీ చెడూను తూకం వేయు
అనుభవాలను అందరితో పంచు-
వృథాప్రయాసని నిరాశ వద్దు
ఆంధ్రమాత సస్యశ్యామల పంటల
నేల- థార్ ఎడారిగా మార్చే
ప్రయత్నమేల?
కడుపులో అగ్ని కీలలు దాచిన
నేల- లావా చూడాలనే కోరిక
ఏల?
నదీమతల్లుల మాగాణినేల-
ధింసా అడుగుల మురిసిన నేల
కడుపుకోతను మిగల్చకు రోరోరి-
ప్రకృతి ప్రళయం తేబోకు రోరోరి
ఆరంభశూరలనే వదంతిని
నమ్మావేమో- పట్టు వీడని
విక్రమార్కులు వీరు
తెలుగోడంటే ఒంటరికాడు-
విశ్వమంతా విస్తరించిన
సామూహిక శక్తి

- **శ్రీలక్ష్మీ చివుకుల**
9441957325

ఈ వారంలోనే ప్రపంచ యువజన దినోత్సవం ఉంది. యువత కేరింతలే కాదు బాధ్యతల్లో కూడా చేయి కలపాలనేది విషయం. దేశంలో యువ జనాభానే ఎక్కువ ఉండటంతో భారత్‌ను యువ దేశంగా పిలుస్తున్నారు. మరి ఆ యువత దేశ ముఖ చిత్రాన్ని ఎలా మార్చబోతోందనే పెద్దలకు నచ్చే విషయం ఈ మధ్య ఒకటి జరిగింది. మేధో వలస గురించి వినే ఉంటాం. ఇక్కడ చదివి ఎక్కడో ఉద్యోగాలు చేసి తమ ప్రతిభ, విజ్ఞానానికి కారణమైన గడ్డను పట్టించుకోని వారి గురించి పెద్ద చర్చే నడుస్తోంది. పేదరికం, నిరుద్యోగం వంటి ఎన్నో సమస్యలకు దేశంలో పరిష్కారం లేదు. ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలోనే ఉన్న భారత్‌కు

ఇలాంటి యువకులే కావాలి

మేధో అవసరం చాలా ఉంది. ప్రతిభ గల ఇంజినీర్లు, వైద్యులు, సాంకేతిక నిపుణులు, ఆర్థికవేత్తలు పనిచేయాల్సింది చాలానే ఉంది. ఇదంతా విడిచిపెట్టేసి పెద్ద ఉద్యోగం, అవకాశం కోసం వేరే చోటకు వెళ్లిపోతే మరో ఇంజినీర్‌ను, వైద్యుణ్ని, నిపుణున్ని తయారుచేసుకునే లోపు ఆ ప్రవాహం మరికొందరిని లాక్కెళ్లిపోతుంది. ఈ బ్రెయిన్ డ్రెయిన్ సమస్యల గురించి వీరు ఆలోచించారో లేదో తెలీదు కానీ తమ ప్రతిభ దేశానికి అంకితమవ్వాలనే ఉద్దేశంతో కోటి రూపాయల జీతమిచ్చే ఉద్యోగాల్ని వదులుకున్నారు. ఢిల్లీలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) విద్యార్థులు.

ఏడాదికి కోటి రూపాయల జీతం వస్తే ఎక్కడైనా ఉద్యోగం చేయడానికి సిద్ధపడిపోతారు. అది అమెరికాలో ఐతే లాటరీ తగలడమన్నట్టు భావిస్తారు. ఢిల్లీ ఐఐటీ క్యాంపస్‌లో ఇంటర్వ్యూలు జరుగుతున్నాయ్. ప్రపంచంలోనే అత్యుత్తమమైన పెద్ద పెద్ద కంపెనీలు రిక్రూట్‌ని చేపట్టాయి. చాలా మంది విద్యార్థుల జీవితాలు మారిపోయేలా అదిరిపోయే ప్యాకేజీలను ఆఫర్ చేసి రిక్రూట్ చేసుకుంటున్నారు. అందులో అత్యుత్తమ ప్రతిభను కలిగిన నలుగురు విద్యార్థులకి ఏడాదికి కోటి రూపాయల ప్యాకేజిని ఆఫర్ చేసింది ఓ కంపెనీ. ఉద్యోగం సాధించడమే కష్టమవుతున్న ఈ రోజుల్లో కోటి రూపాయల జీతమంటే కళ్ళు మూసుకుని ఉద్యోగంలో చేరిపోతారు ఎవరైనా. అలా చేస్తే ప్రత్యేకత ఏముంది. అందుకే నలుగురు కుర్రాళ్లు మాత్రం కోటి రూపాయలు ఇస్తామన్న ఉద్యోగాన్ని తిరస్కరించి బహుళ కంపెనీల రిక్రూటర్లను అయోమయంలో పడేశారు. ఆ కంపెనీ వారు

'దేశమును ప్రేమించుమన్నా' అన్న గురజాడ మాటలను గుర్తుచేస్తున్నారు ఐఐటీ విద్యార్థులు. విదేశాల్లో కోటి రూపాయల ఉద్యోగాలను వదులుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములవడానికి కొందరు ఢిల్లీ ఐఐటీ విద్యార్థులు మొగ్గు చూపితే, ఐఐటీ ఖరగ్‌పూర్ తొలి ర్యాంకర్లేమో కార్పొరేట్ ఉద్యోగాలు కాదనుకుని పరిశోధన వైపు కదిలారు. జేఎన్‌యూ విద్యార్థులేమో రాజకీయ చైతన్యానికి ప్రతీకగా నిలిస్తే.. మరికొందరు విదేశాల నుంచి వెనక్కు వచ్చి దేశాభివృద్ధిలో భాగమయ్యారు.



వీరిని వదలడం ఇష్టంలేక ఇంకా ఎక్కువ కావాలంటే కూడా ఇవ్వడానికి సిద్ధమని ఆఫర్ చేసినా కూడా సారీ.. మేం చేయలేం అంటూ కరాఖండీగా చెప్పేశారు ఆ నలుగురు కుర్రాళ్ళు. “మాకు చదువుకోవడానికి అనేక వసతులు కల్పించింది మా దేశం. ఉత్తమమైన ఫ్యాకల్టీతో పాటు మా ఫీజులను కూడా మా దేశ ప్రజలే చెల్లించారు. మేం మా ప్రతిభను విదేశీ కార్పొరేట్ కంపెనీల ఎదుగుదలకు వాడాలనుకోవడంలేదు.. మా అవసరం మా దేశానికి చాలా ఉంది. ఇక్కడ చదువును ఇక్కడి అభివృద్ధికే ఉపయోగిస్తాం. మీ కోటి రూపాయల ఆఫర్ కన్నా దేశాభివృద్ధికి పనిచేయడమే మాకు బాగా నచ్చింది” అని తేల్చి చెప్పారు. వీరికి ఎనిమిది ఆఫర్లు వస్తే వాటిని వదులుకుని దేశంలోని కోర్ ఇంజినీరింగ్ రంగంలో ఉద్యోగాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇక్కడ జీతాలు వారికి వచ్చిన అవకాశంలో ఐదో వంతు కూడా ఉండవు. వీరే కాదు ఐఐటీ క్యాంపస్ సెలెక్షన్స్‌లో చాలా మంది విద్యార్థులు వారి ప్రతిభను దేశ ప్రగతికి వినియోగించాలనుకుం టున్నారని రిక్రూటర్ల ద్వారా తెలుస్తోంది. ఐఐటీ రూర్కీ, ఐఐటీ గువాహటి, ఐఐటీ బాంబేతో పాటు మిగతా ఐఐటీల్లోని విద్యార్థులు విదేశీ ఉద్యోగాలపై అంత ఆసక్తి కనబరచడంలేదని రిక్రూట్‌మెంట్ నిర్వాహకులు చెబుతున్నారు. ఐఐఎంలలోను ఆ తరహా వాతావరణం కనిపిస్తోంది. ఇలాంటి రివర్స్ బ్రెయిన్ డ్రైన్ అంశం కొన్నేళ్లలోనే పెద్దగా తెరపైకి రాబోతోంది. ఓ వైపు జేఎన్‌యూ విద్యార్థుల రాజకీయ చైతన్యం ప్రభావంతో మిగతా విశ్వవిద్యాలయాల్లోను ఎలాంటి కదలిక వచ్చిందో చూశాం. ఇప్పుడు మేధో వలస కూడా తగ్గేలా పరిస్థితులు మారుతున్నాయి. యువత ఆశావహ వాతావరణాన్ని తేవడంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరుకుందాం.

- జాన్ ప్రభాకర్

వడగాలి

- మొలకలపల్లి కోటేశ్వరరావు
9963845840

"కానివ్వండి, కానివ్వండి! తొందరగా పనికావాలి. ఒక నిముషం పని ఆగడానికి వీల్లేదు'. సూపర్‌వైజర్ కూలీల్ని తొందర చేస్తున్నాడు. కూర్చోనివ్వడం లేదూ. నించోనివ్వడం లేదు. కొరడా పట్టుకుని బానిసలతో పని చేయించినట్లుగా వాళ్ళ వెంట వుండి గదమాయిస్తున్నాడు. మంచినీళ్ళు తాగడానికి కూడా పంపించడం లేదు. పాస్‌కి కూడా అనుమతించడం లేదు. అంత గట్టిగా పనిచేయిస్తున్నాడు..రోడ్డు పని జరుగుతోంది అక్కడే. కంకర రోడ్డు.

విపరీతంగా ఎండ కాస్తోంది.

రోళ్ళు కూడా ఫెటీల్మని పగిలిపోయేలా వుంది. దానికి తోడు హోరున వడగాలి అంత ఎండలోనూ, గాలిలోను కూలీలు రోడ్డు వేస్తున్నారు.

పెద్ద పెద్ద కంకర గంపలు కొందరు అవలీలగా మోస్తుంటే అపసోపాలు పడుతూ అతి కష్టం మీద కొందరు మోస్తున్నారు.

గంపలు మోస్తున్న వాళ్ళలో పది నించి పద్నాలుగేళ్ళ పిల్లల వరకూ వున్నారు. బాలకార్మికులు! కూలీలు ఎండకి చెమటలు కక్కుతున్నారు. గాలికి తోడు ధూళి, పొగ మాదిరిగా లేస్తోంది. కంకరతో వచ్చే దుమ్ము ధూళీ అది!

శారమ్మ భారంగా మోస్తోంది గంప. మనిషి బలహీనంగా సన్నగా వుంది. మూడు నెలల బాలింత ఆమె.

"మా.....మా..... అమ్మాయి పడుతుందే ....ఇందాకట్నించీ ఏడుత్తోంది!" శారమ్మ దగ్గరికి వచ్చాడు ఐదేళ్ళ కొడుకు.

'వస్తున్నా.. ..నువ్వు పా! ' అంది శారమ్మ.

కనుచూపు మేర ఎక్కడా నీడలేదు.

పనికి చాలా దూరంగా ఒక చేలో జమ్మి చెట్టు వుంది.

శారమ్మ ఆ చెట్టుకి పాతకోకతో ఉయ్యాల వేసింది. అందులో మూడు నెలల పసికందుని వేసి, ఐదేళ్ళ కొడుకుని చూడమని కాపలాగా వుంచింది. మూడేళ్ళ కూతుర్ని ఆ చెట్టు నీడనే ఆడుకొమ్మని బొమ్మ ఒకటి ఇచ్చింది. పెద్ద పిల్లలు ఇద్దరికీ ఆకలి అయితే తినమని ఒక గిన్నెలో అన్నం వేసి ఇచ్చింది.

రోడ్డు పనిచేసే వాళ్ళది ఈ వూరు కాదు. ఇక్కడికి దూరం పనుల కోసం వచ్చారు. వలస!

పొట్టకూటి కోసం!

రోడ్ ఐదురోజుల్లో పూర్తి కావాలి.

వచ్చే వారం మంత్రిగారు వస్తున్నారు. మంత్రిగారి కోసమే రోడ్ హడావుడిగా మొదలు పెట్టారు.

"ఎవఁడ్రా అటు పోతాడు? పని దొంగలు ఎక్కడో! దొంగముకాలూ, దొంగ ఎదవలూ...." కసురుకుంటూ తిట్టాడు. సూపర్ వైజర్.

గొడుగు నీడలో నిలబడి, న్యూస్ పేపర్ని మడతపెట్టి విసురుకుంటున్నాడు తను. ఆయన నోరు తెరిస్తే 'పనిదొంగలు' అనే మాట ఆ వెంట బూతులూ వస్తాయి.

" మా...మా... తెగ ఏడుత్తుంది మా.."

కొంగు పట్టుకుని శారమ్మని వదల్దేదు వాడు.

"రేయ్ నువ్వు పోరా! వచ్చిద్దిగానీ నువ్వు పోయి పిల్లని సముదాయిచ్చు!" గుడ్లు ఉరుముతూ కోపంగా వాడ్ని కసురుకున్నాడు సూపర్ వైజర్.

దూరంగా ఉంది చెట్టు. ఆ ఎండలో అక్కడికి పోవాలంటే, వాడికి నీరసంగా నిస్సత్తువగా వుంది.

సూపర్‌వైజర్ మళ్ళీ కోప్పడటంతో వాడు ఉసూరుమంటూ చెట్టు దగ్గరికి వెళ్ళిపోయాడు.

వాడి కాళ్ళకి చెప్పులు కూడా లేవు. మల మల మాడిపోతోంది ఎండ.

మంత్రి గారు పర్యటన అకస్మాత్తుగా నిర్ణయమైపోయింది.

ఊళ్ళో అంగన్ వాడి భవనం నిర్మించారు. భవనం అంటే రెండంటే రెండు గదులే!

పేరు అంగన్ వాడి భవనం

ఆ భవనం మంత్రిగారి చేత ప్రారంభం చేయించాలని కొంత మంది పార్టీ కార్యకర్తలు మంత్రిగారి కులపోళ్ళు గట్టిగా కృషి చేశారు. ఇందులో కులపోళ్ళ పట్టుదలే ఎక్కువ.

మంత్రిగారికి కూడా బాగా కులపిచ్చి!

వేరే పని మీద ఈ ప్రాంతం వస్తున్నాడు. ఎలాగూ వస్తున్నాడు కాబట్టి కులపోళ్ళ మాటని ఎందుకు తీసి వేయాలని, పనిలో పనిగా ఈ వూరు కూడా రావటానికి అంగీకరించారు.

కులం కారణంగానే తనకి మంత్రి పదవి వచ్చింది. కులం కారణంగానే తను ఈ స్థాయికి చేరాడు. కులాన్ని అడ్డం పెట్టుకునే తను పదవులు పొందాడు.

అలాంటప్పుడు కులాన్ని ఎందుకు పోగొట్టుకోవాలని మంత్రి ఆలోచన.

భవన ప్రారంభ కార్యక్రమం ఒకటే అయితే బాగుండదని, వంద మీటర్ల సిమెంట్ రోడ్లకీ, ఎలిమెంటరీ స్కూల్లో ఒక గది నిర్మాణానికీ మంత్రిగారి చేతులు మీదుగా పునాది రాయి వేయించే పని కూడా పెట్టారు.

అలాగే వూరంతా, అందరి ఇళ్లలోనూ, గుడిసెల్లోనూ కూడా మలమూత్ర దొడ్లు ఏర్పాటు చేసే ఒక పథకాన్ని కూడా మంత్రిగారు రూపొందించారు.

ఇన్ని పనుల మీద మంత్రిగారు ఈ వూరు వస్తున్నారు.

అయితే ఈ వూరికి రావడానికి సరైన రోడ్డు లేదు. ఉన్న రోడ్డు ఎప్పుడో తాతల కాలం నాడు వేసింది.అది వేసిన ఏడాదికే పోయింది.

ఇప్పుడు ఆ రోడ్డు మీద అడుగడుక్కి మోకాటి లోతు గుంటలు ఉన్నాయి. దాని మీద వాహనాలు నడపాలంటే సర్కస్‌లో వాహనాలు నడిపినట్టే! సర్కస్ ఫీట్లు చేయాల్సిందే!

గతుకులూ, గుంటలూ కారణంగా ఆ రోడ్డు మీద వారానికో ప్రమాదం అయినా జరుగుతుంది. ఐదారేళ్ళ నుంచి జరుగుతున్న ప్రమాదాల్లో ఇప్పటికీ కనీసం పది మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు.

ఇక పాతిక మంది వరకూ గాయాల పాలై కాలో, చెయ్యో విరక్కొట్టుకున్నారు.

అలాంటి రోడ్డు మీద అతిసుకుమారులైన మంత్రి గారు రావాలంటే అయ్యే పనేనా?

ఆయన గారిది ఎంత సున్నిత శరీరం! ఎంత మృదువైన దేహం!

మంత్రిగారు సుఖంగా సౌఖ్యంగా రావాలని రోడ్ వేయించే పని మొదలు పెట్టారు.

మంత్రి గారి కోసమే అది!

ఆరు కిలోమీటర్ల రోడ్!

టెండర్లు పిలిచే సమయం కూడా లేదు. అర్జంట్ మరి! మంత్రిగారి టూర్ అనుకోకుండా అర్జంట్‌గా నిర్ణయమైపోయింది. రోడ్ కూడా అర్జంట్‌గా కావాలి కదా!

టెండర్లు లేకుండా నామినేషన్ మీద తన అనుచరుడైన కంట్రాక్టర్‌కే ఆ పని అప్పగించాడు. మొత్తం 90 లక్షల పని! 40 లక్షలకి మించి నామినేషన్ మీద పని ఇవ్వకూడదనే నిబంధన ఒకటి. ఏడ్చింది! మనసు వుంటే మార్గం ఉండదా? పనిని మూడు బిట్లుగా విడగొట్టారు. ముగ్గురి పేర్ల మీద ఒక్కొక్కటి 30 లక్షలుగా 90 లక్షలుగా పనిని అప్పగించారు. కంట్రాక్టర్ ఒక్కడే! పేర్లు మూడు, కాగితాల మీద!

పనిలో పదిశాతం అంటే 9 లక్షలు ముందుగానే మంత్రిగారు తన కమీషన్‌గా పుచ్చుకున్నారు. తరువాత పేచీ రాకుండా ముందుగానే జాగ్రత్త పడటం మంత్రిగారి నైజం! అది రివాజు!

కంట్రాక్టర్ అసాధ్యుడు! ఇలాంటి కాంట్రాక్టులు చాలా చేశాడు. చేస్తూన్నాడు. అనుభవాల గని! ఈ రోడ్డుకి సంబంధించి ఆఫీస్‌లో బంట్రోతులు,గుమస్తాలు మొదలుకొని డిఇ,ఇఇ, ఏఇ,జెఇ లాంటి ఇంజనీర్లు అందరికీ ఎవరి మాముళ్ళు వాళ్ళకి ఇవ్వాలి. పని కంటే వాళ్ళకి మాముళ్ళు ముఖ్యం. అమ్యామ్యాల్ని అమాంతం మింగే ఆమాం బాపతు సరుకు అంతటికే ఎవరికి ఇవ్వాల్సింది వాళ్ళకి ఇస్తే, ఇక తనకేం మిగుల్తుంది?

ఆ మిగిలేది ఏదో కూలీల దగ్గరే మిగలాలి. అందుకే కూలీల్ని పీల్చి పిప్పి చేసే చండశాసనుల్లాంటి కర్కోటకుల్ని సూపర్ వైజర్లుగా నియమించుకున్నాడు కాంట్రాక్టర్. ఇక వాళ్ళు కూలీల్ని అల్లాడిస్తున్నారు.

" ఆ పిల్ల ఏందిరా అటుపోతుందీ? అటు ఎక్కడికమ్మాయి?" గదమాయించాడు సూపర్ వైజర్.

"కాలు ముడుచుకుని వస్తా సామీ!"

"నిమిషానికి ఒకరు కాలు ముడుచుకుంటాననీ, చేతులు ముడుచుకుంటాననీ పోవాల్సిందే! ఇట్ట అయితే పని బాగానే సాగిద్ది!

"పాస్ కూడా పోవద్దంటావా ఏంది సారూ? ఒక కుర్రాడు కోపంగా అన్నాడు.

"పోవద్దని ఎందుకంటారా? మీరు కానివ్వండి. బాగా పని చేసేవాళ్ళే! మీ వల్ల నాకు మాట వస్తది!"

"బాగా చేసేవాళ్ళంటే.....ఇంకెట్ట చేస్తారు సారూ?"

"పిల్లదానికి పాలు ఇచ్చి వస్తానయ్యా!" అడిగింది శారమ్మ.

"ఎన్నిసార్లు పోయి పాలు ఇచ్చి వస్తావు? ఇందాక ఒకసారి పోతివే! అంతకు ముందు ఒకసారి పోతివే! అక్కడికీ, ఇక్కడికీ తిరగడమే సరిపోతుంది నీకు! ఇదే పని! అసలు నువ్వు పనిచేసేదే అంతంత మాత్రం! ఉసూరు ముకం దానా..నీ వల్ల దండగ తప్ప లాభం లేదు. అసలు నువ్వు రేపట్నించి పనిలోకి రావాకు!

"మీ సొమ్ము మాకు వూరక వద్దు సామీ! మీ

సొమ్ము వూరక తీసకపోతే కుక్కలు తిని పోతాయి! తొందరగా వస్తానయ్యా!" చెప్పి పరిగెత్తుతూనే చెట్టు దగ్గరికి పోయింది.

శారమ్మ అసలే బలహీనం. అందుకు తోడు సరైన తిండే వుండదు. ఇక పాలేం వస్తాయి? తను తినే కారపు మెతుకులకి ఆ కన్న తల్లికి పాలేం వుంటాయి?

పాప తాగాలని ఎంత ప్రయత్నించినా పాలు వస్తేనా? చిటికెడు వస్తాయేమో? కొద్దిసేపు లాగి లాగి ఆ చిటికెడు తాగి, ఏడ్చి ఏడ్చి అలిసిన పాప నిద్రకి పడింది.

పసితనంలో తనని కూడా తల్లి ఇలానే పని ప్రదేశానికి తీసుకుపోయేదట! అయితే అప్పుడు ఏడవకుండా నోట్లో గురువింద గింజంత నల్లమందు వేసేదట! ఆ మందు ప్రభావానికి తను కదిలేదీ, మెదిలేదీ కాదట! పాపకి కూడా వేద్దామని నల్లమందు కోసం ప్రయత్నించింది కానీ, ఎక్కడా నల్లమందు దొరకలేదు.

పసిపాపకి పాలు ఇచ్చి, చెట్టుకి కట్టిన అన్నం కుండ దించి కొడుక్కి కూతురికీ గిన్నెలో ఇంకొంత వేసి తిరిగి పన్లోకి వెళ్ళింది శారమ్మ.

శారమ్మ పనిలోకి దిగిన కొద్దిసేపటికే కొడుకు అంత దూరం నుంచి వచ్చాడు.

"అమ్మా.... అమ్మాయి మళ్ళీ ఏడుత్తుందే! నువ్వు రావే!"

"రేయ్....నువ్వు పోరా! ఎక్కడికిరా వచ్చేది? ఏడ్చి ఏడ్చి అదే నిద్రలోకి జారుకుంటుందిలే! పో ముందు ఇక్కణ్ణించి !పోరా! సూపర్ వైజర్ కోప్పడుతూ, పసివాడ్ని కొట్టినంత పనిచేసి వెళ్ళగొట్టాడు.

వాడు ఏడుస్తూ వెళ్ళి పోయాడు.

చాలా సేపటికి తరువాత శారమ్మ మళ్ళీ అడిగింది.

"పాలు ఇచ్చి వస్తా సామీ!"

"పాల్లేదూ, పెరుగులేదు! పని కానివ్వు. ఎక్కడికీ పోయేదీ. ఇవ్వాళ ఇప్పటికి పదిసార్లు వెళ్ళావు. ఇక వెళ్తే వప్పుకోను!"

కొద్దిసేపు తరువాత మళ్ళీ అడిగింది శారమ్మ.

"పొయొస్తా స్వామీ.... పసిదానికి పాలు ఇచ్చి ఇప్పుడే వస్తా సామీ!"

"పంపించను అని చెప్పా కదా! ఎన్నిసార్లు అడుగుతావు? ఇక్కడ పని కావాలా, లేదా? వెళ్తే వప్పుకోను!" కరాఖండిగా చెప్పాడు సూపర్ వైజర్.

"సామీ మీకు పుణ్యం ఉండుద్ది సామీ.."

"పుణ్యం లేదూ, పాపం లేదూ. చెప్పాకదా? ఒకసారి చెబితే అర్థం కాదా? ఎన్నిసార్లు చెప్పాలి?

"పసికందు సామీ.. ఉండలేదు సామీ...

"ఉండలేకపోతే పోతుంది. ఏమవుతుందేమిటి? నీకు పాలు ఇచ్చే పనీ తగ్గుతుంది.. ఇంకా ఇద్దరు ఉన్నారు కదా? ఇప్పుడు వెళ్తే నీకు ఇవ్వాళ కూలీ కూడా ఇవ్వను. నాగా వేసుకుంటా!"

"అంత మాట ఎందుకులే సామీ! అంది శారమ్మ"

"దొంగసచ్చినోడు... వీడి దినం ఎప్పుడు చేస్తారో కానీ.. తొందరగా చేస్తే బాగుండు!" తిట్టుకుంది శారమ్మ.

ఆ ఎండకీ , వడగాలికీ అక్కడ పాప ఏడ్చీ ఏడ్చీ సొమ్మసిల్లిపోయింది.

శారమ్మని పని ముగిసే వరకు కాలు కదపనివ్వలేదు సూపర్ వైజర్.

పని ముగిసిన తరువాత పరిగెత్తుకుపోయింది శారమ్మ.

అప్పటికే బిడ్డ ఏడ్చీ ఏడ్చీ ... ఇక ఏడుపు కూడా రాక గొంతెండి పోయి, వూపిరి కూడా ఆడక. ఆ వూపిరి ఆగిపోయింది. నిండు నూరేళ్ళు జీవించాల్సిన ఆ పసిబిడ్డకి నూరేళ్ళు నిండిపోయాయి.

పాపని ఆ స్థితిలో చూసిన శారమ్మ, గుండె పగిలేలా భోరుమని పెద్దగా ఏడ్చింది.

కాళ్ళు, చేతులూ కడుక్కుంటున్న మిగతా కూలీలు శారమ్మ ఏడుపుకి పరిగెత్తుకుని వచ్చారు. బిడ్డని చూసారు. చక్కగా బంగారు వన్నెతో మిలమిలలాడుతున్న పాప అచేతనంగా!

కడుపు మండింది కూలీలకి.

"రేయ్... మేం పశువులం కాదురా...మనుషులంరా! నువ్వు కూలి ఇస్తుంటే నీ కింద పశువుల్లా పనిచేయాల్రా? బిడ్డపోతే పోతుందిలే అంటావా? నీ నోటి కూత నిజమై నిజంగానే బిడ్డ పోయిందిరా? ముక్కు పచ్చలారని బిడ్డ..... కలకాలం జీవించాల్సిన బిడ్డ.... నువ్వు మాత్రం ఎందుకురా ఇంకా?"

కూలీలు కర్రలు తీసుకున్నారు. వెంటపడ్డారు. సూపర్ వైజర్ని పట్టుకున్నారు. ఈడ్చి ఈడ్చితన్నారు. చితక్కొట్టారు.

సూరీడు నిప్పు కణికలా మండుతూ పడమటి కొండల్లో పడబోతున్నాడు.

వడగాలి కూలీల క్రోధంలా హోరున కొడుతోంది.

✦

గ్రీటింగ్.. గ్రీటింగ్...!

గ్రీటింగ్ కార్డుల తయారీలో పేరొందిన కంపెనీ హాల్‌మార్క్. ఈ కంపెనీ వ్యవస్థాపకుడు జోయ్స్ హాల్మార్క్. చిన్నతనం నుండే పేదరికాన్ని అనుభవిస్తున్న జోయ్స్ చదువు మానుకుని తన 16వ ఏట సేల్స్‌బాయ్‌గా మారాడు. 1912లో ఒక చిన్న పెట్టెలో పోస్టుకార్డుపై సందేశాలతో కూడిన చిత్రాల్ని గీసి నగరంలోని ప్రముఖ పుస్తక దుకాణాలకి పంపేవాడు. క్రిస్‌మస్ గ్రీటింగులు, వేలన్‌టైన్స్ డే గ్రీటింగ్‌ల్ని కాగితాల్లో, ఉత్తరాల్లో పంచుకునే ఆ కాలంలో తొలిసారిగా గ్రీటింగ్ కార్డులని కవర్‌లలో ఉంచి అమ్మే విధానాన్ని కనిపెట్టిన జోయ్స్ గ్రీటింగ్ కార్డుల పితామహుడు. 1928లో మిస్సోరి నగరంలో హాల్‌మార్క్ కంపెనీని స్థాపించాడు. లండన్‌లో ప్రముఖ బంగారు ఆభరణ తయారీదారులు హాల్‌మార్క్ గుర్తుతో ఆభరణాలని అమ్మేవారు. ఆ గుర్తునే తన గ్రీటింగ్స్ వెనుక ముద్రించి అమ్మడం మొదలు పెట్టాడు జోయ్స్. అప్పటి నుండి హాల్మార్క్ గుర్తుతో వచ్చే తన గ్రీటింగ్స్‌కి గుర్తింపు లభించింది. జోయ్స్ గ్రీటింగ్ కార్డుల తయారీలో అప్పటి మార్కెట్ పోటీని తట్టుకుని తక్కువ కాలంలోనే ఎంతో పేరు గడించాడు.

నేడు ఒక్క అమెరికాలోనే 18 వేల ఉద్యోగులతో కొనసాగుతున్న హాల్మార్క్ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 43వేల దుకాణాలను స్థాపించింది. మొత్తం 30 భాషల్లో హాల్మార్క్ గుర్తుతో ముద్రించే గ్రీటింగ్ కార్డులు 100 దేశాల్లో అమ్ముడవుతున్నాయి.

- ప్రపంచ జనాభాలో ఎడమ చేతి వాటం కలవారు పది శాతం మంది ఉంటారని అంచనా.

- క్రీడల్లోను దిగ్గజాలే. టెన్నిస్, ఈత, బేస్‌బాల్, క్రికెట్, బాక్సింగ్‌ల్లో వీళ్లు కింగ్‌లు.

- నెపోలియన్, లియోనార్డో డావిన్సీ, మైకేలాంజెలో, ఐన్‌స్టీన్, న్యూటన్, గాంధీజీ, బిల్ గేట్స్, ఓప్రా విన్‌ఫ్రే, జిమీ హెండ్రిక్స్ లెఫ్టీలే.



- జంతువుల్లో మాత్రం ఇరు చేతి వాటాల నిష్పత్తి సమానంగా ఉంటుందని కొన్ని పరిశోధనల్లో గుర్తించారు.

- మార్లిన్ మన్రో, మోర్గన్ ఫ్రీమన్, రాబర్ట్ డీ నీరో, పియర్స్ బ్రాస్నన్, ఏంజెలినా జోలీ, కీనూ రీవ్స్, టామ్ క్రూస్, జిమ్ కేర్రీ... ఎమినెమ్, జస్టిన్ బీబర్... అమితాబ్, మమ్ముట్టి, ... రతన్ టాటా, సచిన్ టెండూల్కర్... బిల్ క్లింటన్, బరాక్ ఒబామా, నరేంద్ర మోడీ.. ఇలా ఆయా రంగాల్లోని ప్రముఖుల్లో అత్యంత పాపులర్ వ్యక్తుల్లో ఎడమ చేతివాటం వారే అధికం.

- అపోలో వ్యోమగాముల్లో నలుగురిలో ఒకరు ఎడమ చేతి వాటం వారే.

- క్వెర్టీ కీ బోర్డ్ మీద కేవలం ఎడమ వైపు అక్షరాల ద్వారా 1447 ఆంగ్ల, కేవలం కుడి వైపు అక్షరాలతో 187 ఆంగ్ల పదాల్ని టైప్ చేయొచ్చు.

- మెదడుకు సంబంధించిన రోగాలు వచ్చే అవకాశం కూడా వీరికి ఎక్కువే. స్కిజోఫ్రీనియా, డిస్లెక్సియా, ఏడీహెచ్‌డీ వంటి మనో వ్యాధులతో సతమతమయ్యే అవకాశం ఉంది.

- వీరికి కోపమెక్కువని కొన్ని పరిశోధన ఫలితాలు చెబుతున్నాయి.

- నీటి అడుగున దృష్టి సామర్థ్యం వీరికి ఎక్కువగా ఉంటుంది.

- మల్టిపుల్ స్టిమ్యులీ, మల్టీ టాస్కింగ్ విషయాలు వేగవంతంగా ఉంటాయి.

- కళలు వీరితో ఓ రకంగా ప్రేమలో పడతాయేమో. గొప్ప కళాకారుల్లో ఎడమ చేతివాటం వారే ఎక్కువ. వీరిలో ఎక్కువ మంది కళా రంగాల వైపు మళ్లుతారని ఓ సర్వేలో తేలింది. భాష, సంగీత రంగాల్లోను బాగా రాణిస్తారు.

సెయింట్ లారెన్స్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఐక్యూ పరీక్షల్లో 140 కన్నా ఎక్కువ ఐక్యూ ఉన్నవాళ్లలో కుడి చేతి వాటం కన్నా ఎడమ చేతి వాటం వారే మిన్నగా తేలారు.

12 దేశాల్లో 25 వేల మందితో ఓ సర్వే నిర్వహిస్తే... ఎడమ చేతి వాటం వారే ఎక్కువగా మద్యపానం చేస్తారని తేలింది.

కుడి చేతి వాటం వారి కోసం రూపొందించిన వస్తువులను ఉపయోగించడంలో ప్రమాదాలు జరిగి ఏటా 2500 మంది ఎడమ చేతి వాటం వారు మరణిస్తారని ఓ లెక్క.

(ఆగస్ట్ 13 లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా...)

చెత్తంతా ఏమవుతోంది? ఆ చెత్తను ఏం చేస్తారు? అసలా చెత్త వల్ల ఏమైనా ఉపయోగం ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం కావాలంటే 'బన్యన్' అనే ఈ సంస్థ గురించి తెలుసుకోవాల్సిందే. ఇది ఎక్కడో లేదు మన హైదరాబాద్‌లోనే ఉంది.



చెత్త నుంచి ఆదాయం

చెత్త..చెత్త..చెత్త.. దేశంలో ఎక్కడ చూసినా చెత్తే. కొండలా, పర్వతంలా పేరుకుపోతోంది తప్ప తగ్గట్లేదు. సమస్య సమస్యలానే ఉంది కానీ పరిష్కార మార్గాలు కనిపించట్లేదు. డంపింగ్ చేయడం వరకే ఆలోచిస్తున్నారు తప్పితే దాని వల్ల దుష్ప్రభావాలను పట్టించుకోవడం లేదు. ఈ సమస్యే అమెరికాలోని ఇద్దరు భారతీయులను కదిలించింది. వ్యర్థాలను రీసైకిల్ చేయడం ద్వారా చాలా సమస్యలకు పరిష్కారం చెప్పొచ్చని భావించిన ఇద్దరు యువకులు మణి వాజ్‌పేయి, రాజ్ మదన్ గోపాల్‌లు 'బన్యన్ నేషన్' పేరుతో సోషల్ వెంచర్ స్థాపించారు. అత్యున్నత సాంకేతిక పద్ధతులతో విజయవంతంగా ప్రాజెక్ట్‌ను నిర్వహిస్తున్నారు. నగర శివార్లలో సంస్థ నెలకు 300 టన్నుల ప్లాస్టిక్ చెత్తను రీసైక్లింగ్ చేయగలిగే సామర్థ్యంతో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతానికైతే నెలకు 100 టన్నుల ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేస్తున్నది. పనికిరానిదంతా చెత్తకుప్పలోకి పోతుందని మనం అనుకుని వదిలేస్తాం. కానీ చెత్తకుప్పలోంచి కూడా పనికొచ్చేది చాలా ఉందని వీరి ప్రాజెక్ట్‌ను చూస్తే తెలుస్తుంది.



అంకురార్పణ

మణి వాజ్‌పేయి, రాజ్ మదన్ గోపాల్ ఇద్దరూ కాలేజీ రోజుల నుంచే మంచి స్నేహితులు కావడంతో తరుచుగా కలుసుకునే వారు. ఒకరి అభిప్రాయాలను మరొకరితో పంచుకునేవారు. చదువు పూర్తి అయిన తరువాత ఇద్దరు అమెరికాలోనే వేర్వేరు ఉద్యోగాలలో స్థిరపడినా వీరి మధ్య స్నేహం కొనసాగుతూనే ఉంది. అదే సమయంలో భారతదేశంలో నెలకొని ఉన్న సమస్యల గురించి చర్చించేవారు ఈ యువ ఇంజినీర్లు. అలా మణి తన బిజినెస్ మోడల్ గురించి వివరించాడు. బెర్కిలీ, కొలంబియా బిజినెస్ స్కూళ్ల కోసం తాను రూపొందించిన బిజినెస్ మోడల్ గురించి మదన్‌తో వివరించాడు మణి. కొలంబియాకు చెందిన గ్రీన్ హౌజ్ ఇంక్యుబేటర్ ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా మిత్రులిద్దరు కలిసి హైదరాబాద్, బెంగళూరుల్లో పర్యటించారు. ఆ సమయంలోనే ఈ ప్రాజెక్టు ఆలోచనకు బీజం పడింది. హైదరాబాద్‌లో పెద్ద పెద్ద మల్టీనేషనల్ కంపెనీల్లో పదుల సంఖ్యలో ఫెసిలిటీస్ మేనేజర్లను కలిశారు. వారితో పాటు హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్లతో సైతం మాట్లాడిన తరువాత ప్రైవేట్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కాంట్రాక్టర్లు, చెత్త ఏరేవాళ్లతో మాట్లాడి నగరంలోని చెత్త పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. ఇలా మూడు నెలల పాటు అధ్యయనం చేశారు. చెత్తతో విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం వరకు అన్ని అంశాలపై ఉన్న అవకాశాలను పరిశీలించారు. తిరిగి అమెరికా వెళ్లిన తర్వాత ఈ ఇద్దరూ మూడు నెలల పాటు అమెరికాలో వేస్ట్ మేనేజ్ మెంట్ ప్రాసెస్‌పై అక్కడి డంప్ యార్డుల చుట్టూ తిరిగి అవగాహన పెంచుకున్నారు. న్యూయార్క్ సిటీ లాంటి పెద్ద నగరాల్లో పర్యటించి చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ప్లాంటు ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకున్నారు. వాళ్లకు పూర్తి అవగాహన వచ్చింది. వెంటనే వాళ్ల ఉద్యోగాలను వదిలి పెట్టారు. జులై 2013లో ఇండియాకు వచ్చి బన్యన్‌ను ప్రారంభించారు. ముందుగా దేశంలోని టెండర్లన్నింటినీ పరిశీలించి శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన బయోగ్యాస్ ఎనర్జీ కంపెనీ, రూర్కెలా స్టీల్ ప్లాంట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు.

కీలక అడుగు

ప్రతీ ఏడాది దేశ వ్యాప్తంగా రీ సైక్లింగ్‌కు అవకాశమున్న 67 లక్షల టన్నుల వ్యర్థాలను భారత్‌లో డంప్ చేస్తున్నారు. వీటి విలువ కనీసం 20 వేల కోట్లు ఉంటుందని అంచనా. చెత్తను ఏరుకునేవారి దగ్గర దళారులు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. నేరుగా పెద్ద ఎత్తున తమ సంస్థ ద్వారా కొంటే చెత్త ఏరేవాళ్లకు అంతో కొంతో లాభం ఉంటుందనీ అనుకున్నారు. ఈ ఆలోచన గురించి బంధువులకు, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు చెప్పగానే... వారంలో యాభై లక్షల రూపాయలకు పైగా సాయం చేశారు. టెక్నాలజీని జోడించి క్షేత్రస్థాయిలో సిబ్బంది చురుగ్గా పనిచేసేలా వ్యవస్థను రూపొందించారు. ఎక్కడెక్కడ చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయో చూడటం... వాటిని రీసైకిల్ చేయడం ఈ ప్రాజెక్టు పని. ప్రీ సార్టింగ్, కలెక్షన్, పోస్ట్ సార్టింగ్ ఆ తర్వాత రీసైక్లింగ్... ఇలా పలు దశలన్నింటినీ సాంకేతిక పర్యవేక్షణలో ఉంటాయి. స్టీవ్ బ్లాంక్స్ లీన్ లాంచ్ ప్యాడ్ ప్రోగ్రామ్ తోపాటు, కొలంబియా బిజినెస్ స్కూల్‌లోని గ్రీన్ హౌజ్ ఇంక్యుబేటర్‌లో బన్యన్ బిజినెస్ మోడల్‌ను ఆవిష్కరించడం మరో గొప్ప విషయం. ప్లాస్టిక్ రీసైక్లింగ్‌లో పూర్తి స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్న తొలి మోడల్ వారిదేనని బన్యన్ నేషన్ అంటున్నది.

- అనంతోజు మోహన్ కృష్ణ

కార్న్ పాకెట్స్

కావాల్సిన పదార్థాలు

కార్న్-1 కప్పు

బ్రెడ్ ముక్కలు-8

పాలు-1/2 కప్పు

పచ్చిమిర్చి- 2

అల్లం-వెల్లుల్లి పేస్ట్-1టేబుల్ స్పూన్

కొత్తిమీర తరుగు-1టేబుల్ స్పూన్

నూనె- సరిపడా

తయారుచేసే విధానం

ముందుగా మొక్కజొన్న గింజల్ని బాగా ఉడకబెట్టుకోవాలి. మిక్సీ జార్‌లో అల్లం-వెల్లుల్లిపేస్ట్, పచ్చిమిర్చి, కొత్తిమీర తరుగు, ఉడకబెట్టిన మొక్కజొన్న గింజల్ని వేసి మెత్తగా బ్లెండ్ చేసుకోవాలి. బ్రెడ్ ముక్కల్ని పాలు/నీటిలో రెండు నిమిషాలు ఉంచి తర్వాత నీరు లేకుండా ప్రెస్‌చేయాలి. ఇప్పుడు నాలుగు బ్రెడ్ స్లైస్‌లని తీసుకుని వాటిపై కార్న్ మిశ్రమాన్ని మరో బ్రెడ్ స్లైస్‌ని ఉంచి గట్టిగా ప్రెస్‌చేసి పక్కన పెట్టుకోవాలి. స్టౌపై బాణలి పెట్టి కొద్దిగా నూనె వేసి వేడెక్కిన తర్వాత బ్రెడ్ ముక్కల్ని వేసి గోధుమ రంగు వచ్చే వరకు వేయించుకోవాలి. ఒక ప్లేట్‌లో టిష్యూ పేపర్‌ని పరిచి బాగా వేగిన పాకెట్స్‌ని ఉంచాలి. ఇలా చేయడం ద్వారా ఎక్కువ నూనె అంటకుండా ఉంటాయి. చెట్నీ లేదా కెచెప్‌తో కార్న్ పాకెట్స్‌ని తింటే రుచికరంగా ఉంటాయి.

కార్న్ క్రాకర్స్

కావాల్సిన పదార్థాలు

మొక్కజొన్న పలుకులు- 1కప్పు

బియ్యప్పిండి - 1కప్పు

గోధుమ పిండి-1 కప్పు

మైదా-1/2 కప్పు

శనగపిండి-1/2 కప్పు

బొంబాయి రవ్వ-1/2 కప్పు

నువ్వులు-2 టేబుల్ స్పూన్లు

గరమ్‌మసాల-1 టేబుల్ స్పూన్

కారం-1 టేబుల్ స్పూన్

ఉప్పు -తగినంత

ఇంగువ-చిటికెడు

అల్లం-వెల్లుల్లి పేస్ట్-1 టేబుల్ స్పూన్

నూనె- కొద్దిగా

తయారుచేసే విధానం

ముందుగా మొక్కజొన్న గింజల్ని ఎండబెట్టి మిక్సీలో పలుకులుగా గ్రైండ్ చేసుకోవాలి. ఒక బౌల్ తీసుకుని బియ్యప్పిండి, గోధుమ పిండి, మైదా, బొంబాయి రవ్వ, శనగ పిండి కొద్దిగా నీరు వేసి కలుపుకోవాలి. నువ్వుల్ని గోధుమరంగు వచ్చే వరకు వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మొక్కజొన్న మిశ్రమంలో కొద్దిగా గోరు వెచ్చని నూనె, వేయించి పెట్టుకున్న నువ్వులు, కారం, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్, గరమ్ మసాల వేసి బాగా కలపాలి. 10 నిమిషాల తర్వాత ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి ఒక ప్లేట్‌లో పెట్టాలి. స్టౌ పై బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత మొక్కజొన్న ఉండల్ని చేత్తో వత్తి నూనెలో బంగారు రంగు వచ్చే వరకు వేయించుకోవాలి. సర్వింగ్ ప్లేట్స్‌లో కార్న్ క్రేకర్స్‌ని ఉంచి కొంచెం చల్లారాక అతిథులకందించండి.

రిబ్బన్ పకోడ

కావాల్సిన పదార్థాలు

మొక్కజొన్న పిండి-1 కప్పు

శనగపిండి-1 కప్పు

బియ్యప్పిండి-1/2 కప్పు

అల్లం వెల్లుల్లి పేస్ట్-2 టేబుల్ స్పూన్లు

కారం-2 టేబుల్ స్పూన్లు

ఉప్పు-తగినంత

నూనె- సరిపడా

తయారుచేసే విధానం

ముందుగా శనగ పిండిని ఉండలు లేకుండా జల్లించుకుని పక్కన పెట్టుకోవాలి. ఒక బౌల్‌లో మొక్కజొన్న పిండి, బియ్యప్పిండి, శనగపిండి, గోరువెచ్చని నూనె వేసి కలుపుకోవాలి. కొద్దిగా నీటిలో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి 10 నిమిషాల తర్వాత వడగట్టి ఆ రసాన్ని మొక్కజొన్న పిండి మిశ్రమంలో వేసి కలుపుకోవాలి. తర్వాత కొద్దిగా ఉప్పు, కారం నీరు కూడా చేర్చి, మెత్తగా కలపాలి. స్టౌ పై బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కనివ్వాలి. ఇప్పుడు జంతికలు వత్తే గొట్టంలో రిబ్బను బిళ్లని ఉంచి కొద్ది కొద్దిగా మొక్కజొన్న పిండి పెట్టి వత్తాలి. బంగారు రంగు వచ్చే వరకు వేయించి సర్వింగ్ ప్లేట్‌లో ఉంచి వేడి వేడిగా రిబ్బన్ పకోడాని రుచి చూడండి.

బాల నేస్తాలు

పదాలు పూరించండి

ఇక్కడ ఏడు బొమ్మలున్నాయి. అయితే వాటి ఇంగ్లిష్ పేర్లలో ఒకటి రెండు అక్షరాలు మిస్సయ్యాయి. ఆ అక్షరాన్ని కలిపేస్తే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా మిస్సయిన అక్షరాన్ని గుర్తించి ఖాళీల్లో నింపేయండే!

nr,o,b,ie,t,c,h



ఏమిటది?

కొప్పుంది కాని జుట్టులేదు...
కళ్లు న్నాయి కానీ చూడలేదు
ఏమిటది.



కొబ్బరి కాయ

రంగులు అద్దండి



కనిపెట్టండి

అగ్గిపుల్లలతో చేసిన ఒక త్రిభుజాన్ని ఇక్కడుంచాం. వాటిలో కొన్ని పుల్లల్ని కదిపితే మొత్తం ఎనిమిది త్రిభుజాలు ఏర్పడతాయి. అదెలాగో కనిపెట్టండి.



నీడ గుర్తించండి

ఇక్కడొక పక్షి బొమ్మతో పాటు దానెదురుగా కొన్ని నీడలున్నాయి. పక్షి బొమ్మ ఆధారంగా దాని అసలైన నీడేదో గుర్తించండి.



గుర్తించండి

పిల్లలూ! వివిధ దేశాలకి సంబంధించిన నృత్యాల పేర్లను ఇక్కడుంచాం! పైనున్న అక్షరాల్లో అవెక్కడున్నాయో గుర్తించి పెన్నుతో మార్క్ చేయండి.

Z	Q	R	Z	K	Z	S	V	S	O	F	I	Y	N	Z	J	N	[illegible]	Z
T	Y	Z	W	T	K	B	Q	W	P	D	V	W	I	E	[illegible]	E	T	V
L	D	D	W	V	T	Y	P	N	Q	A	X	I	R	C	T	P	Q	U
A	F	I	E	N	P	R	H	U	K	H	T	W	A	I	U	K	Y	C
W	S	B	L	C	N	M	I	V	E	P	I	O	M	F	C	L	X	A
T	M	L	Z	M	O	H	B	A	Z	L	A	F	O	X	T	R	O	T
Y	W	A	A	W	S	M	F	D	I	S	C	O	O	D	O	M	O	M
H	R	S	M	S	Z	E	L	T	S	U	H	O	R	Y	P	N	A	W
Q	A	C	G	R	O	I	A	W	T	I	S	Z	L	U	E	D	A	T
V	O	R	E	L	O	B	M	P	H	Q	N	P	L	R	E	J	D	E
D	D	P	S	K	F	B	E	I	L	Y	W	D	A	G	L	I	A	U
S	F	N	O	A	T	G	N	I	U	G	Z	U	B	V	L	T	B	N
R	A	Z	D	E	C	N	C	R	W	X	Q	E	N	A	S	V	M	I
B	H	W	L	R	H	I	O	D	A	S	N	B	B	S	D	U	A	M
H	U	L	A	B	I	W	L	G	K	I	D	M	Y	E	R	X	L	Y
C	A	N	C	A	N	S	F	N	L	S	U	L	U	Q	B	Z	D	O
B	Q	J	J	A	Z	Z	R	A	O	R	X	K	O	B	M	I	L	I
C	J	O	S	M	H	A	X	T	P	H	I	P	H	O	P	P	B	Q
Y	W	I	Y	J	B	U	S	B	U	B	E	J	N	R	E	R	W	J

Ballet
Ballroom
Barn
Belly
Bolero
Break
Can-Can
Disco
Flamenco
Foxtrot
Hip Hop
Hula
Hustle
Jazz

Lambada
Limbo
Line
Mambo
Minuet
Polka
Rumba
Salsa

Slow
Square
Swing
Tango
Tap
Twist
Waltz
Zydeco

11ఏళ్ల ఇంజినీర్



సెలవొస్తే చాలు చాలా మంది పిల్లలు పుస్తకాలు పక్కన పెట్టి కంప్యూటర్, ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లలో వివిధ ఆటల్లో తలమునకలౌతుంటారు. అందరిలానే 11 ఏళ్ల వైషాలిని కూడా గంటల తరబడి ల్యాప్‌టాప్‌తో గడిపేస్తున్నా తన ఆలోచనలు మాత్రం భిన్నంగా ఉంటాయి. చెన్నయ్‌లోని తిరునెల్వేల్ ప్రాంతానికి చెందిన ఈ చిన్నారి చదివేది ఎనిమిదో తరగతే అయినా కంప్యూటర్స్‌కి సంబంధించిన పెద్ద పెద్ద సాంకేతిక సమస్యలపై ఇంజినీరింగ్ విద్యార్థులడిగే ప్రశ్నలకి ఇట్టే సమాధానమిచ్చేస్తుంది. తను కనబరిచిన ఈ అద్భుత ప్రతిభకి మైక్రోసాఫ్ట్ ప్రొఫెషనల్ సర్టిఫికేట్‌తో పాటు సిసిఎన్ఎ (సిస్కో సర్టిఫైడ్ నెట్‌వర్క్ అసోసియేట్) నుండి పతకాన్ని అందుకుంది వైషాలిని. పదేళ్లకే చెన్నయ్‌లోని కలశలింగం ఇంజినీరింగ్ కాలేజీలో ప్రవేశం కోసం పరీక్ష ఎగ్జామ్ రాసి 90 శాతం ఉత్తీర్ణతని సాధించింది. నిజానికి ఇది ప్రపంచ రికార్డ్. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కి ప్రయత్నించినా తక్కువ వయసుండటంతో గిన్నిస్‌లో విషాలిని పేరు నమోదు కాలేదు. 12 ఏళ్లకి ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష పూర్తి చేసిన ఇక్బార్ హైదర్ (పాకిస్తాన్) కన్నా పిన్న వయస్సులో ఇంజినీరింగ్ ఎంట్రన్స్ పరీక్ష పూర్తిచేసిన అమ్మాయిగా గుర్తింపు తెచ్చుకుంది. ఐఐటి, ఎన్ఐటి వంటి ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలలో బిఇ, బిటెక్ విద్యార్థులకి సెమినార్లు ఇవ్వడంతో పాటు ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సెమినార్లకి ముఖ్య వక్తగా వైషాలిని పాల్గొంటోంది. ఇంజినీరింగ్ లో ప్రవేశం లభించినా బాల్యాన్ని దూరంచేసుకోవద్దనే తల్లితండ్రుల సూచనతో వైషాలిని ఎనిమిదో తరగతిలో చదువు కొనసాగిస్తోంది. తన ఏడాది వయసులో గొంతు సంబంధిత వ్యాధితో బాధ పడిన వైషాలిని ప్రస్తుతం గ్రూప్ -1 పరీక్షలకి సిద్ధమవడం, అనర్గళంగా ప్రసంగాలను ఇవ్వడం ఎంతో మందిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



బొమ్మను పూరించండి

మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ జోకర్ బొమ్మని ముందుగా సగం గీసి ఉంచాడు. మీరు మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా పూర్తి చేయండే!

తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో 10 తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించి సున్నా చుట్టేయండి.





ప ద వి కా స ం - 25

కూర్పు: రావెళ్ల



ఆధారాలు

అడ్డం

2. అటు నుండి వయసు (2)
4. తలకీ మొండానికీ మధ్య భాగం (2)
6. పదార్థాలకు ఇది ఉంటేనే చాలా ఇష్టంగా తింటారు (2)
8. దీని గుడ్డు అందరికీ ఇష్టమే (2)
9. తెలుగు జింజర్ గజిబిజిగా (3)
11. వాడు-వీడు- మామాలో చివరి అక్షరాలు (3)
16. మర మనిషి (2)
17. ఒళ్ళు వేడెక్కితే ఇది వచ్చిందంటాం (3)
18. అరటి చెట్టుకు వేలాడేది (2)
21. ఒత్తు లేని బరువు (3)
23. ఈ రంగుకొచ్చాక ఆకు రాలుతుంది (3)
25. పాకిస్థాన్‌లోని ఒక వార్తాపత్రిక (2)
26. ఫ్రాన్స్ దేశపు జాతీయ పుష్పం (2)
28. ఒక లోహం (2)
29. జిగురు (2)

నిలువు

1. చిన్న (2)
3. ఇది ఉంటేనే శరీరానికి కదలిక (3)
4. తలలో ఉండేది (3)
5.ఇంగ్లీషులో శరీరం (2)
7. ఈ గింజ నీటిని తేటబరుస్తుంది(2)
8. ప్రాణం ఉన్నా కదల లేని మనిషి ఇందులోకి వెళ్ళినట్టే (2)
10. సముద్రంలో ఉవ్వెత్తున లేచేది (2)
12.ఎండిన చెట్టు కింది నుండి (2)
13. కెన్యా రాజధాని (3)
14. ఏడు రోజులు (3)
15. నీటిలో ఉండి రక్తం తాగేది (3)
19.రమ తిరగబడితే యంత్రము (2)
20. తూకం వేసేది (2)
21. జర్మనీ రాజధాని క్లుప్తంగా (2)
22. ఒక దుంప (3)
23. పాము విప్పేది (3)
24.టైగర్ (2)
25.కుక్క(2)
27. మన దేశరాజధాని తిరగబడింది.(2)

సుడోకు

	3		2		9		4	5
9	2			1	4	6	7	8
			5			9		3
2	4			3				
		9	7		8	3		
				9			5	6
4		8			3			
6	5	3	9	4			8	1
1	7		8		6		3	

గతవారం జవాబులు

6	9	2	1	3	8	5	7	4
4	7	8	2	9	5	1	6	3
1	5	3	4	7	6	8	2	9
2	6	7	8	1	3	4	9	5
8	1	4	6	5	9	2	3	7
9	3	5	7	4	2	6	8	1
5	4	6	3	2	7	9	1	8
7	8	1	9	6	4	3	5	2
3	2	9	5	8	1	7	4	6







పెట్టెలో మ్యూజియం



ప్రపంచ ప్రఖ్యాత మ్యూజియాల్లో తల దూర్చి మరీ చూడాలనుంటే ఈ ఇంటరాక్టివ్ ఆర్ట్ ప్రాజెక్ట్‌కు వెళ్లాల్సిందే. మినియేచర్ గేలరీలతో ఫ్రాన్స్‌లోని లావ్రే, న్యూయార్క్‌లోని గగోసియయన్, లండన్‌లోని సాచీ, టాటే మోడ్రన్ గేలరీల్ని బుల్లిపెట్టెల్లో ప్రతి సృష్టి చేసేశారు జార్జియాకు చెందిన సూక్ష్మ కళాకారులు. ఫాల్సిఫికేషన్ సృజనకారులైన రూబెన్స్, లీచెన్‌స్టెయిన్, హిర్స్ట్, టేజీ గబూనియాలు గేలరీల్లోని ప్రదర్శితాల్ని మక్కీకి మక్కీ దింపేశారీ చిట్టి ఫ్రేముల్లో. ఆయా గేలరీల లైటింగ్, ఇంటీరియర్‌లను పెట్టెలో పట్టేశారు. తల అడ్డంగా తిప్పి పెట్టెలోకి పెట్టి చూస్తే ఆ గొప్ప ఆర్ట్ గేలరీలు చాలా దగ్గరగా కళ్లకానుతాయి. ఈ హైపర్ రియలిజమ్ సృజనాంశం సందర్శకుల్ని బాగా ఆకట్టుకుంటోంది.

సిద్ధి
బాత్ & కిచన్

ఇచ్చట అన్నిరకముల

| పైప్స్ & ఫిట్టింగ్స్ | టైల్స్ | సానిటరి | ట్యాప్స్ | బాత్ టబ్స్ |
| షవర్ సిస్టమ్స్ | బాత్ ఆక్ససరీస్ | వుడన్ ఫ్లోరింగ్ | వాల్ పేపర్స్ |
చిమ్నీస్ & హాబ్స్ | వాటర్ ట్యాంక్స్ | కిచెన్ సింక్స్ |

మరింత సమాచారం కొరకు వెంటనే ఫోన్ చేయండి

+91 8562 278 910, 91 00 55 55 66

38/173, బుడ్డాయపల్లె చిన్నచౌక్, కడప-516002.

www.siddhibathandkitchen.com

Check List

Book Number	KNSR09B132	Date	03/09/22
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29